# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 5-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:164 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

విశ్వరహాస్యం
విజ్ఞాన గూఢచారి
ఛేదన చింత.

బంగారుభాష
దారిమార్చని భాష
సోమర్ల భాష.

పదార్థ ధర్మం
మనసు ప్రభావితం
దేహం ప్రశాంతం.

నియంత యుద్ధం
నడవాలి పెత్తనం
నాయక ట్రంపు.

పండిన పంట
దళారి షావుకారి
రైతు బికారి.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ఇరురాష్ట్రాలతో సహా
రేవంతుడి ప్రతిపాదన !
మోడీని కొట్టాలంటె
చేయాలోయ్ యమసాధన !
భారత్ అమెరికా కాదు
ఎవరేంజేసినా గాని,
కోరుకుందాం రాహుల్ ను
నెహ్రూ ఫ్యామ్లీ ప్రధాని !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు..
# ఇజ్రాయెల్, ఇరాన్ హోరాహోరీ దాడులు

టెహ్రాన్, మార్చి 4: ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సులేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది.

### హెర్మేస్ డ్రోన్లను కూల్చేశాం: ఇరాన్

కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది.

### 800కి చేరిన మృతుల సంఖ్య

ఇజ్రాయెల్ గత శనివారంనాడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి ఇంతవరకూ ఇరాన్‌లో 800 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా, ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్టు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ (అఇబొఉఆట) తెలిపింది.

వీటిలో నావికాదళ నౌకలు, సబ్‌మెరీన్లు, యాంటీ షిప్ క్షిపణి వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు కూడా ఉన్నాయని వెల్లడించింది.

కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీకి ప్రజలు బుధవారం రాత్రి నుంచి మూడు రోజులు నివాళులు అర్పించనున్నాయి. పేటికలో ఉంచిన ఆయన మృతదేహాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచనున్నారు.

## శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకపై సబ్‌మెరైన్ దాడి.. 101 మంది గల్లంతు

కొలంబో మార్చి 4:ఇజ్రాయెల్–అమెరికా కూటమి, ఇరాన్ మధ్య యుద్ధంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్‌కు చెందిన నౌకపై జలాంతర్గామి దాడి జరిగింది. ఈ దాడిలో 101 మంది గల్లంతయ్యా రు. మరో 78 మంది గాయపడినట్టు శ్రీలంక నేవీ, రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు బుధవారం నాడు తెలిపాయి. వీరిలో 32 మంది పరిస్థితి తీవ్రంగా ఉందని పేర్కొన్నాయి.

కాగా, 180 మందితో ఉన్న ఐఆర్ఐఎస్ దేనా నౌక మునిగిపోతున్నట్టు తమకు సమాచారం రావడంతో వెంటనే సహాయక సిబ్బందిని రంగంలోకి దించినట్టు విదేశాంగ మంత్రి విజిత హెరాథ్ తెలిపారు. నౌక వేగంగా మునిగిపోతున్న సమయంలో 32 మందిని సిబ్బంది రక్షించారు. గాలె నగర సమీపంలో దక్షిణ తీరానికి కొద్ది దూరంలో ఈ దాడి జరిగింది. క్షతగాత్రులను గాలేలోని స్థానిక ఆసుపత్రికి తరలించారు. సబ్‌మెరైన్‌తో దాడి జరిపిందెవరనేది వెంటనే వెల్లడి కాలేదు. ఐఆర్ఐఎస్ దేనా నౌక విశాఖపట్నం లో జరిగిన నావికా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది.

## రాజీనామా దిశగా నితీశ్ కుమార్.. రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం

పట్నా, మార్చి 4: బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశాలున్నాయని, అలాగే నితీశ్ తనయుడు నిషాంత్ కుమార్ బిహార్ ఉప ముఖ్యమంత్రి అవుతారని ప్రచారం జరుగుతోంది. తద్వారా నితీశ్ కుమార్ స్థానంలో బీజేపీ తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిగా నియమించే అవకాశం ఉందని చెబుతున్నారు.

కాగా, నిషాంత్ కుమార్‌ను రాజ్యసభకు నామినేట్ చేయవచ్చనే ప్రచారం కూడా ఇంతకు ముందు జరిగింది. అయితే ఇంత వరకూ ఆయన అభ్యర్థిత్వానికి సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లు సిద్ధం కాలేదు. నిషాంత్ కుమార్ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టడం ఖాయమని మాత్రం జేడీయూ వర్గాలు చెబుతున్నాయి. బిహార్‌లో 5 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. జేడీయూ రెండు స్థానాలకు గెలుచుకునే అవకాశం ఉంది. జేడీయూ శాసనసభా పక్షం కూడా గురువారం నాడు సమావేశమవుతోంది. ఈ సమావేశంలో కేంద్రంలో నితీశ్ ప్రధాన పాత్ర పోషించడానికి అంగీకరించే విషయంపై చర్చ జరగవచ్చని తెలుస్తోంది.

ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 200 సీట్లకు పైగా స్థానాలను గెలుచుకుని విజయకేతనం ఎగురవేసింది. బీజేపీ 89 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. మిత్రపక్షమైన జేడీయూ 85 స్థానాలతో రెండో స్థానంలోనూ, లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) 19 స్థానాలతో మూడో స్థానంలోనూ నిలిచాయి.

## హైదరాబాద్ మియాపూర్‌లో డ్రగ్స్ కలకలం

హైదరాబాద్, మార్చి 4: మియాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా.. ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో డ్రగ్ పెడ్లర్ హనుమంతుతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మహేష్, ఆదర్శ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి సుమారు 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్ఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ మార్కెట్ విలువ దాదాపు 1.5 లక్షల రూపాయలుగా అంచనా.

దర్యాప్తులో ఈ ముఠా నైజీరియన్‌ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు తేలింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## వేట్లపాలెంలో పేలుడు ఘటనలో 25కి చేరిన మృతులు

కాకినాడ, ఫిబ్రవరి 04: వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ప్రమాద ఘటనలో మరొకరు మరణించారు. బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వీర శ్రీను (39) కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 25కు చేరింది. మంగళవారం ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోవరాజు మరణించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మిగిలిన ఐదుగురు క్షతగాత్రులకు వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని పోలాల మధ్య ఏర్పాటు చేసిన కేంద్రంలో బాణసంచాను కార్మికులు తయారు చేస్తున్నారు. ఫిబ్రవరి 28వ తేదీన బాణసంచా కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఇద్దరు లోవరాజు, వీర శ్రీను.. మంగళ, బుధవారాల్లో మరణించారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరోవైపు ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ రవికృష్ణ నేతృత్వంలో ఈ కమిటీని నియమించింది. ఈ ప్రమాద ఘటనకు బాధ్యులను గుర్తించాలని జారీ చేసిన ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ ప్రమాద ఘటనపై నెల రోజుల్లో నివేదిక అందజేయాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

### నాగర్ కర్నూల్ జిల్లాలో యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

మహబూబ్‌నగర్, మార్చి 4:మండల కేంద్రంలోని హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు బుధవారం ఆందోళన నిర్వహించారు. సొసైటీకి 700 బస్తాల యూరియా వచ్చినట్లు యాప్‌లో చూపించి, 2-3 సెకండ్లలోనే స్టాక్ అయిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారుస్మార్ట్ ఫోన్లు లేని వారికి, యాప్ వాడటం రాని వారికి యూరియా ఎలా ఇస్తారంటూ రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాప్ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# భూములు కోల్పోయే రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం: మంత్రులు

హైదరాబాద్, మార్చి 4: ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా పరిధిలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని మంత్రులు తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక పరిహార చెల్లింపుకు సిద్ధంగా ఉన్నామని.. భూములు కోల్పోయే రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్వయంగా తామే రైతుల వద్దకు వెళ్లి భూసేకరణ ప్రక్రియ చేపడతామని మంత్రులు వెల్లడించారు. గత ప్రభుత్వం భూసేకరణ, పరిహారంపై మొండిగా వ్యవహరించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని, వారికి అమోదయోగ్యమైన ప్యాకేజీ ఇచ్చి భూములు సేకరిస్తామని చెప్పారు.

రామప్ప - లక్నవరం ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై 15 రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రులు పేర్కొన్నారు. సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టుపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, అక్కడ ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల జాప్యంపై కాంట్రాక్టర్లపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని మంత్రులు పేర్కొన్నారు.

## భారత పర్యటనకు ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ రాక.. నేడు ప్రధానితో భేటీ

న్యూఢిల్లీ, మార్చి 4:ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్ విచ్చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం ఘన స్వాగతం పలికింది. గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. స్టబ్‌తోపాటు ఫిన్‌లాండ్‌కు చెందిన పలువురు కీలక నేతలు, అధికారులు కూడా ఇండియా చేరుకున్నారు. స్టబ్ తన పర్యటన సందర్భంగా ఇండియాతో కీలక ఒప్పందాలు చేసుకుంటారు.

ఈ మేరకు అనేక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపారం, వాణిజ్యం, సాంకేతిక రంగంలో సహకారం వంటి అంశాల్లో ఒప్పందాలు జరుగుతాయి. స్టబ్స్.. ఈ చర్చల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కూడా సమావేశమవుతారు. స్టబ్స్ ఇండియాలో పర్యటిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. స్టబ్స్‌కు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. స్టబ్స్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఉపయోగపడుతుందని, గురువారం ఆయనను కలుసుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. భారత పర్యటనపై స్టబ్ కూడా ప్రత్యేకంగా స్పందించారు.

భారత పర్యటనపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ములను కలుసుకోబోతున్నట్లు వెల్లడించారు. గురువారం సాయంత్రం మీడియాతో మోదీ, స్టబ్ మాట్లాడుతారు. ఫిన్‌లాండ్ ప్రధాని పెట్టెరి ఒర్పో ఇటీవలే ఇండియాలో పర్యటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇక.. ఇండియా, ఫిన్‌లాండ్ మధ్య చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలున్నాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.

## చిత్తూరు జిల్లాలో కాల్పుల కలకలం.. స్నేహితుడిని కాల్చిచంపిన యువకుడు

అమరావతి, మార్చి 4: పేకాటలో కొందరు ఆర్థికంగా సర్వస్వం కోల్పోతుండగా మరికొందరు ఆత్మహత్యలు, హత్యలకు గురువుతున్నారు. తాజాగా చిత్తూరు జిల్లాలో పేకాటలో రూ.2 లక్షల డబ్బులు పోగొట్టుకుని బాకీ పడ్డ యువకుడిపై కాల్పులు జరపడంతో ఒకరు చనిపోయారు. చిత్తూరు మండలం తుమ్మిందపాళ్యంలో సాయికుమార్ అనే యువకుడిని ఢిల్లీ బాబు అనే మరొకరి పేకాటలో బాకీ పడ్డాడు. దీంతో బాకీ డబ్బుల విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య వివాదం తలెత్తగా ఢిల్లీ బాబు వద్ద ఉన్న నాటు తుపాకీతో సాయి కుమార్‌పై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అంతడు కుప్పకూలీ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విలక్షణ నటుడు కొంగర జగ్గయ్య



కొంగర జగ్గయ్య విలక్షణ నటుడు. ఎన్టీఆర్ ఏఎన్నార్ లతో పాటు, విశేష ప్రేక్షకాదరణ, అశేష అభిమానులను పొందిన నటుడు. ధరించిన పాత్ర ఏదైనా తన విలక్షణమైన నటనతో ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేసి ఒక ప్రత్యేకతను, నిండు తనాన్ని, హుందా తనాన్ని సంతరింప జేసిన విశిష్ట వ్యక్తి జగ్గయ్య. జగ్గయ్య సినీ నటుడే కాదు ఒక రచయిత, సాహిత్యకారుడు, కళా వాచస్పతి, చిత్రకారుడు, పాత్రికేయుడు, సంపాదకుడు, రాజకీయ వేత్త. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో అనౌన్సర్. "ఆకాశవాణి... వార్తలు చదువుతుంది కొంగర జగ్గయ్య" అంటూ కంచు కంఠంతో ఆయన వార్తలు చదివిన సంగతి ఆనాటి శ్రోతలకు విదితమే.

కొంగర జగ్గయ్య (డిసెంబర్ 31, 1928 - మార్చి 5, 2004) మాజీ పార్లమెంటు సభ్యుడు, ఆకాశ వాణిలో తొలితరం తెలుగు వార్తల చదువరి. సినిమాలలోను, అనేక నాటకాలలోను వేసిన పాత్రల ద్వారా ఆంధ్రులకు జగ్గయ్య సుపరిచితుడు. మేఘ గంభీరమైన ఆయన కంఠం కారణంగా "కంచు కంఠం" జగ్గయ్యగా, "కళా వాచస్పతి"గా పేరు గాంచాడు. శివాజీ గణేశన్ నటించిన చిత్రాలు తెలుగులోకి అనువదించిన అన్ని సందర్భాల్లో జగ్గయ్యే కంఠం వినిపించేది. 'కళా వాచస్పతి' అనేది జగ్గయ్యకు ప్రదానం చేసిన బిరుదు కాదు. అది ఢిల్లీ లోని అంతర్జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇచ్చిన గౌరవ డాక్టరేటు. స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఉద్యమ పోరాటంలో పాల్గొంటూ అజ్ఞాత వాసంలో తలదాల్చుకునేందుకు వచ్చిన అంతర్రాష్ట్ర సమర యోధులకు తన ఇంటిలో ఆవాసం కల్పించిన దేశ భక్తుడు జగ్గయ్య.

జగ్గయ్య గుంటూరు జిల్లాలోని తెనాలికి సమీపంలో దుగ్గిరాల దగ్గర మోరంపూడి అనే గ్రామంలో, 1928, డిసెంబర్ 31 న ధనవంతుల కుటుంబంలో జన్మించాడు. 11 సంవత్సరాల పిన్న వయసులో రామాయణంలోని లవుడి పాత్రను బెంగాలీ రచయిత ద్విజేంద్రలాల్ రాయ్ వ్రాసిన సీత అనే ఒక హిందీ నాటకంలో పోషించాడు. గుంటూరు లోని ఆంధ్రా క్రిస్టియను కాలేజీలో ఎన్.టి.రామారావు, కొంగర జగ్గయ్య ఇద్దరు సహ విద్యార్థులు. వీళ్ళిద్దరూ కలిసి ఎన్నో నాటకాలు ప్రదర్శించారు. జగ్గయ్య మూడు సంవత్సరాల పాటు వరుసగా ఉత్తమ నటుడు పురస్కారం పొందాడు.

ఇంటర్మీడియట్ తరువాత కొంత కాలం "దేశాభిమాని" అనే పత్రికలో ఉప సంపాదకుడిగానూ, ఆ తర్వాత "ఆంధ్రా రిపబ్లిక్" అనే ఆంగ్ల వారపత్రికకు సంపాదకుడి గానూ పనిచేశాడు. ఢిల్లీలో "ఆల్ ఇండియా రేడియో"లో మూడు సంవత్సరాల పాటు వార్తలు చదివే ఉద్యోగం చేసాడు. చిత్రకారుడు అడవి బాపిరాజు వద్ద చిత్రలేఖనం లో శిక్షణ పొందాడు.

1950ల నుండి 1970ల వరకు తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవ చేసాడు. జగ్గయ్య దాదాపు 500కు పైగా చిత్రాలలో, వంద

సినిమాల్లో హీరోగా, మరో వంద సినిమాల్లో సహ కథానాయకుడిగా నటించాడు. రెండువందల చిత్రాల్లో క్యారక్టర్ నటుడుగా రాణించాడు. ఎన్.టి.రామారావుతో కలిసి విజయవాడలో రవి ఆర్ట్ థియేటర్ స్థాపించి ఎన్నో నాటకాలు వేసి పరిషత్తు పోటీలలో బహుమతులు గెలుచుకున్నాడు. బుచ్చిబాబు రాసిన దారిన పోయే దానయ్య నాటిక జగ్గయ్యకు పేరు తెచ్చి పెట్టింది.

ఎన్.టి. రామారావు, జమున, సావిత్రి, గుమ్మడి, ముక్కామల వంటి నటీనటులతో రంగస్థలం మీద నటించిన జగ్గయ్య ఎందరు నటులకో మార్గదర్శకుడు. నటి సావిత్రి నాట్యానికే పరిమితమైన ఆరోజుల్లో తను రచించిన 'బలిదానం' అనే నాటకం ద్వారా రంగస్థల నటిగా మార్చిన ఘనత జగ్గయ్యకు దక్కుతుంది.

100కు పైగా సినిమాలలో డబ్బింగు చేసాడు. తమిళ చిత్రరంగ నటుడు శివాజీ గణేశన్ నటించిన తెలుగు సినిమాలలో జగ్గయ్యే గాత్రధారణ చేసేవాడు. అంతేకాదు తెలుగులోకి డబ్బింగు చేసిన జురాసిక్ పార్క్ అనే ఆంగ్ల చిత్రంలో రిచర్డ్ అట్టెంబరో పాత్రకు తన గాత్రాన్ని అరువు ఇచ్చాడు.

అల్లూరి సీతారామరాజులో పోషించిన రూథర్ ఫర్డ్ పాత్ర ఆయన జీవితంలో మరపురానిది. ఆ సినిమా తీసే నాటికి రూథర్ ఫర్డ్ చరిత్ర మరచి పోయిన వ్యక్తి కాదు. రూథర్ ఫర్డ్ ఎలా ఉంటాడో, ఎలా ప్రవర్తించేవాడో తెలిసిన వాళ్ళు అప్పటికి చాలా ఉన్నారు. 1940 వరకు ప్రభుత్వ సర్వీసులో ఉన్నా డు. కృష్ణా జిల్లా, గుంటూరు, కడప తదితర ప్రాంతాల్లో పనిచేశాడు. వారిని కలిసి, జగ్గయ్య రూథర్ ఫర్డ్ ప్రవర్తన గురించి, మనస్తత్వం గురించి తెలుసుకున్నాడు. రూథర్ ఫర్డ్ చాలా మంచి వ్యక్తి అని, సీతారామరాజు అంటే ఆయనకు గౌరవం ఉండేదని తెలుసుకున్నాడు. అయితే రూథర్ ఫర్డ్ బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయుడుగా, సేవకుడిగా అతను సీతారామ రాజును పట్టుకోక తప్పని స్థితి గురించి అవగాహన కలిగాక, జగ్గయ్య చిత్ర రచయిత మహారథిని కలిసి ఆ పాత్రను రొటీన్ విలన్ లా కాకుండా విధి నిర్వహణకు బద్ధుడై ఉండే హుందా అయిన వ్యక్తిలా మార్చి వ్రాయాలని కోరాడు. అలా ఆ పాత్ర చిత్రణ మార్చడంతో ఆ పాత్ర నిలబడడంతో బాటు సీతా రామరాజు పాత్ర మరింతగా హిట్ అయింది. ఆ సినిమా చూశాక పి.వి.నరసింహారావు జగ్గయ్యకు ఫోన్ చేసి "మీ పాత్ర పోషణ అద్భుతం." అని ప్రశంసించారట.

1967లో నాలుగవ లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో ఒంగోలు నియోజక వర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, 80 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాడు. లోక్ సభకు ఎన్నికైన తొలి దక్షినాది, తొలి భారతీయ నటుడు జగ్గయ్య కావడం విశేషం.

1930లో గాంధీజీ నాయకత్వంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం నేపథ్యంలో డాన్సులు, డ్యుయెట్ల వంటి ఆకర్షణలు లేకుండా "పదండి ముందుకు" తీశారు. ఈ తొలి రాజకీయ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం 50,000 రూపాయల పురస్కారాన్ని ఇచ్చింది. ఈ సినిమా రష్యాలో తాష్కెంట్ ఫిల్మ్ ఫెస్టివల్ తో బాటు మరికొన్ని నగరాల్లో ప్రదర్శితమైంది.

సంభాషణలతో బాటు చిత్రం చివర్లో వచ్చే 'మంచికి కాలం తీరిందా' అనే పాటను కూడా జగ్గయ్యే వ్రాశాడు. ఇది మహమ్మద్ రఫీ పాడిన తొలి తెలుగు పాట. కృష్ణ ఒక చిన్న పాత్ర చేశాడు. మోహన్ బాబు నిర్మించిన 'కుంతీ పుత్రుడు' లో జగ్గయ్య చివరిసారిగా నటించారు. నోబెల్ పురస్కారము అందుకున్న రవీంద్రుని గీతాంజలిని "రవీంద్ర గీతా" అనే పేరుతో తెలుగులోకి అనువదించాడు. గీతాంజలికి ఇది తొలి తెలుగు అనువాదం. రవీంద్ర నాథ ఠాగూరు రాసిన నాటకం "సాక్రిఫైస్" (రాజీఇతీతిటతిఇవ) ను తెలుగులోకి "బలిదానం" అనే పేరుతో అనువదించాడు.

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన "పద్మభూషణ్"తో సత్కరించింది. ఢిల్లీ లోని సంస్కృత విశ్వ విద్యాలయం "కళా వాచస్పతి"అనే బిరుదుతో జగ్గయ్యను సత్కరించింది. తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ "డాక్టరేటు"తో సత్కరించింది.తమిళనాడు ప్రభుత్వం "కలైమా మణి" బిరుదు నిచ్చింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదుతో సత్కరించింది. 2004, మార్చి 5 న 76 సంవత్సరాల వయసులో చెన్నైలో గుండెపోటుతో జగ్గయ్య మరణించాడు.

(మార్చి 5 ... కళా వాచస్పతి కొంగర జగ్గయ్య వర్ధంతి.)



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

**రాధశ్రీ రాగాలు**

ట్రైను లోపల చెయిను
రమణి మెడలో చెయిను
లాగు క్రిమినలు బ్రెయిను
అనును రాధశ్రీ !!
మన నిజీకరణమ్ము
పొగమంచు వలె కమ్ము
తుదకు మిగులును దుమ్ము
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

మంచికొరకు తపించిన
మనిషి సృష్టి ఆయుధం
అతనిపైనే అవుతున్నది
హత్యచేస్తూ సాయుధం
రాజ్యాలేలే నియంతల
రక్తదాహ దుష్కృత్యం
యుద్ధాలకు అస్త్రాలై
ఉసురుదీసే ప్రతినిత్యం



-వేల్పుల నారాయణ
9440433475

## సప్త పదులు

**స**హనం
అసహనం

చెడుపై
మంచికి
విజయమే హోళికా
దహనం

-సరోజ రెబ్బాప్రగడ
9663306023

**భే**ధాలు
వాదాలు

కమ్ముకొస్తున్న
యుద్ధమేఘాల
మధ్య అమాయకుల
ఆర్తనాదాలు

-కాకర్ల, చెంచలరావు
ఒంగోలు.

**క**లుగు
మెలుగు

అందరితో
కలిసిమెలిసి
ఉంటేనే
జీవితానికి
వెలుగు

-సరోజ రెబ్బాప్రగడ
9663306023


# నేటినిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

2 హైదరాబాద్    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    గురువారం 5-3-2026



## ఘంటారావం

**అ**ధికంగా మాట్లాడటమంటే
ఆత్మ విశ్వాసం అడుగంటినట్టే
ఆచితూచి మాట్లాడడమంటే
అంతరంగ నియంత్రణమున్నట్లే.

**అ**ందరి ఆమోదం కోసం
ఆందోళన చెందుతున్నావా
నీ మీద నమ్మకాన్ని
నీవే కోల్పోతున్నావా.

**ని**త్యం నిన్ను
ద్వేషిస్తూనే ఉన్నాను
నా మనసులో నిన్ను
మోస్తూనే ఉన్నాను.

**గూ**డైనా లేని తల్లి
వర్షంలో తడుస్తోంది
తల్లి కన్నీటి వర్షంలో
పిల్ల తడుస్తోంది.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# సాయుధపోరాట నవలపై సముచిత విశ్లేషణ



- ప్రొ॥ ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి,
తెలుగువిశ్వవిద్యాలయం
09618032390

**'బందూక్'** ఒక కాల్పనిక నవల కాదు. ఒక కాలక్షేప నవల కాదు.

ఉజ్వలమైన తెలంగాణా సాయుధపోరాట ఇతిహాసానికి సంక్షిప్త నవలీకరణ. నిజాం నిరంకుశ రాజరిక పరిపాలన. గ్రామాలలో భూస్వాముల దుర్మార్గాలు, దౌర్జన్యాలు. నిజాం మిలటరీ, పోలీసులు, రజాకార్ల అమానవీయ అరాచకాలు. ఆటవిక సమాజానికి అచ్చమైన ప్రతిరూపం. ప్రజాకవి మఖ్దూం వర్ణించినట్లు....

**'అది ఒక దయ్యాలమేడ**
**శిధిల సమాజాల జాడ**
**పీనుగులను పీక్కుతినే**
**రాబందుల రాచవాడ'**

అదొక చీకటిరాజ్యం. ఆధునిక యుగంలోనూ యధేచ్ఛగా కొనసాగిన ఆటవిక పరిపాలన. ప్రపంచమంతా ప్రజాస్వామ్యవ్యవస్థతో పురోగమిస్తూ ఉంటే, భారతదేశంలోని హైదరాబాద్ దక్కన్ సంస్థానం నిజాం నవాబు రాజరిక వ్యవస్థ కింద దుర్భరమైన జీవితాన్ని గడిపింది.

వెట్టిచాకిరీ, భూస్వాముల పీడన, రజాకార్ల దాడులు, ప్రజల మానాలకూ, ప్రాణాలకూ రక్షణ లేని పరిపాలన. కనీస ప్రజాస్వామ్య హక్కులు లేని దీనస్థితి. గస్తీ నిషాన్ తిర్మణ్ (జి.వో.నెంబర్ 53) ప్రకారం వాక్, సభా, పత్రికా స్వాతంత్ర్యాలు నిషేధింపబడిన దుష్టవ్యవస్థ. నిరక్షరాస్యత. నిరుద్యోగం. దుర్భర దారిద్ర్యం. ఆకలి. అవమానాలు. గ్రామాలపై నిజాం మిలటరీ, రజాకార్ల దాడులు. స్త్రీల మానభంగాలు, గృహదహనాలు, తుపాకీ కాల్పులు, గాలిలో కలిసిపోయిన ప్రజల ప్రాణాలు. అడగే దిక్కే లేదా.. ప్రశ్నించే గొంతులే లేవా.. అని జనం అల్లాడుతున్న వాతావరణంలో 'ఆంధ్రమహాసభ' ఆవిర్భవించింది. ఒక సాంస్కృతిక సంస్థగా ప్రారంభమైన ఈ సంస్థ పేద గ్రామీణ ప్రజల్లో 'సంఘం'గా, 'సంగం'గా గుర్తింపు పొందింది. సంస్థాన ప్రజలను చైతన్యపరిచింది. సంఘటితం చేసింది. నిరసనలతో ప్రారంభించి, సాయుధపోరాటానికి పిలుపిచ్చే సాహసోపేతమైన సంస్థగా ప్రజల్లో విస్తరించింది.

మట్టి మనుషులు మహావీరులయ్యారు. సామాన్యమానవులు మాన్యులైన మహానాయకులుగా ఎదిగారు. ప్రజలనుండి కవులు, గాయకులు, కళాకారులు రూపొందారు. 'సంగం', 'గుత్పల సంగం'గా మారింది. 'కాల్మొక్త గులాపోన్ని' అన్న ప్రజలు ఆగ్రహంతో కళ్ళెర్రజేశారు. 'బాంచన్ కాల్మొక్త' అని దీనంగా విలపించిన సాధారణజనం, రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, వివిధకులాల, వృత్తుల వాళ్ళు బందూకులు పట్టారు. ఆంధ్రమహాసభ దళాల్లో చేరారు. గెరిల్లా దళాలేర్పడ్డాయి. సాయుధ పోరాట శిక్షణా కేంద్రాలు వెలిశాయి.


1947 ఆగస్టు 15 నాడు భారతదేశానికి బ్రిటీష్ పాలన నుండి విముక్తి లభించింది. దేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. కానీ హైదరాబాద్ సంస్థానానికి స్వేచ్ఛ లభించలేదు. నిజాం నవాబు 'ఆజాద్ హైదరాబాద్' అని ప్రకటించాడు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయననీ, ఇదొక స్వతంత్ర దేశంగా కొనసాగుతుందనీ ప్రగల్భాలు పలికాడు.

1947 సెప్టెంబర్ 13 నాడు భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రమహాసభ సంయుక్తంగా 'సాయుధపోరాటానికి' పిలుపిచ్చాయి. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ ఈ ప్రకటనపై సంతకాలు చేశారు. ఊరూరా, వాడవాడా ప్రజలు కదిలారు. మరోవైపు గ్రామాలపై నిజాం పోలీసులు, మిలటరీ, రజాకార్ల దాడులు పెరిగాయి.

ప్రజలు ప్రతిఘటించారు. చేతికి దొరికిన ఆయుధాలతో ఎక్కడికక్కడ రజాకార్లను తరిమికొట్టారు. భూస్వాములు గ్రామాలు వదిలి, హైదరాబాద్ నగరానికి పారిపోయారు. గ్రామరక్షక దళాలు అనిర్వచనీయమైన తిరుగుబాటు బావుటా నెగరేశాయి. పోరాటంలో వేలాది మంది అమరులయ్యారు. రక్తతర్పణం జరిగింది. వేలాదిగ్రామాలు విముక్తమయ్యాయి. లక్ష ఎకరాల భూమి రైతులకు పంచిపెట్టడం జరిగింది.

ఇదొక ఒడువని కథ. భారత స్వాతంత్రోద్యమంలో విలక్షణమైనదీ, విశిష్టమైనదీ చారిత్రాత్మక తెలంగాణా సాయుధ పోరాటం. పోరాటకాలంలోనూ, తదనంతర కాలంలోనూ వేలాది పాటలు విరచింపబడినాయి. వందకు పైగా కథలు వెలువడినాయి. ఇరవై ఐదు నవలలు వెలుగుచూశాయి. వందలాది కవితలు, అనేక కవితా సంపుటులు ఉద్యమ దర్పణాలుగా ప్రచురింపబడినాయి. బుర్రకథలు, ఒగ్గుకథలు,హరికథలు, యక్షగానాలు, నాటకాలు, నాటికలు, ప్రజాకళారూపాలు, జీవితచరిత్రలు, స్వీయచరిత్రలు (ఆత్మకథలు), పరిశోధన గ్రంథాలు, విశ్లేషణ గ్రంథాలు వెలువడినాయి. వెలువడుతూనే ఉన్నాయి.

విశిష్టమైన తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యంలో విశేషమైన నవల కందిమళ్ళ ప్రతాపరెడ్డిగారి 'బందూక్'. ప్రముఖ




కొండపల్లి నీహారిణి
సెల్:9866360082



> అదొక చీకటిరాజ్యం. ఆధునిక యుగంలోనూ యధేచ్ఛగా కొనసాగిన ఆటవిక పరిపాలన. ప్రపంచమంతా ప్రజాస్వామ్య వ్యవస్థతో పురోగమిస్తూ ఉంటే, భారతదేశంలోని హైదరాబాద్ దక్కన్ సంస్థానం నిజాం నవాబు రాజరిక వ్యవస్థ కింద దుర్భరమైన జీవితాన్ని గడిపింది.

నాయకులకు కొరియర్‌గా, బాలగెరిల్లాగా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అనుభవంతో, జ్ఞాపకాలతో ఆయన ఈ నవలను రచించారు. ఇది మొదట 1996 జూలై సంచిక 'చతుర'లో సంక్షిప్త నవలగా ప్రచురింపబడింది. అశేషంగా పాఠకులు, విమర్శకుల ప్రశంసలు పొందింది. ఈ నవల రాయడానికి రచయితను ప్రోత్సహించిన సాహితీవేత్త శ్రీచలసాని ప్రసాదరావు. 'చతుర' మాసపత్రికలో ఈ నవలను చదివిన ఆనాటి విద్యార్థిని వింధ్యవాసినీ దేవి ప్రభావితురాలై, తరువాతి కాలంలో 'బందూక్' నవలపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్.పరిశోధన చేసింది.

ఈ సంక్షిప్త నవలకు లభించిన ఆదరణను ప్రేరణగా తీసుకుని రచయిత కందిమళ్ళ ప్రతాపరెడ్డిగారు, దీనికి సమగ్ర రూపాన్నిచ్చి, 2006 లో ప్రథమముద్రణగా, 2010మార్చిలో ద్వితీయముద్రణగా వెలువరించారు. ఎందరో సాహితీప్రముఖుల, విశ్లేషకుల, పరిశోధకుల, జైల్లలో ఉన్న రాజకీయ ఖైదీల ప్రశంసలు ఈ నవలకు లభించాయి. యుజిసి

> విశిష్టమైన తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యంలో విశేషమైన నవల కందిమళ్ళ ప్రతాపరెడ్డిగారి 'బందూక్'

వారి నెట్ ప్రశ్నాపత్రంలో 'బందూక్' నవలపై ప్రశ్న వచ్చింది. ఈ నవలపై వివిధ పత్రికలలో వచ్చిన సమీక్షలను ఒకసారి పరిశీలిద్దాం.

పేలిన 'బందూకు': తెలంగాణ సాయుధ పోరాటం, దాని నేపథ్యం తెలిసిన వారు ఈ తరంలోచాలా తక్కువ. చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఆ పోరాటం చరిత్ర పుస్తకాల్లోనూ పెద్దగా కనిపించదు. చరిత్ర రాసినా చదివించే గుణం లేకపోతే చేసిన ప్రయత్నమంతా వృథానే. -ఇలాంటి ప్రముఖ అధ్యాయాలకు సజీవ రూపం ఇవ్వాలంటే సాహిత్య చట్రంలోనే సాధ్యం అవుతుంది. అటువంటి ప్రయత్నాలు చేసిన వారిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ఆ కొద్దిమందిలో కందిమళ్ల ప్రతాపరెడ్డి ఒకరు. ఆనాటి సాయుధపోరాటాన్ని ప్రత్యక్షంగా గమనించిన అనుభవంతో ఆయన రాసిన 'బందూక్' నవల కదలనీయకుండా చదివిస్తుంది. అప్పటి తెలంగాణ పల్లెల్లో జరిగిన దారుణాలను కళ్లముందు ఆవిష్కరించి కన్నీళ్లు తెప్పిస్తుంది.

**- ఈనాడు**

ఏకబిగిన చదివించే నవల: తెలంగాణా శైలిలో సాగిన ఈ నవల సులభమైన పదాలతో ఏకబిగిన చదవగలిగే విధంగా వుంది. చరిత్ర పాఠాల్లో తెలంగాణా ప్రజలు పడిన బాధలు చదివినా... ఈ నవలలో అవే బాధలు సజీవచిత్రాలుగా మన కళ్లముందు నిలుస్తాయి. నవలలోని పాత్రలు, సంభాషణలు చాలా సహజంగా అనిపిస్తాయి. జాతి ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని ప్రతి ఒక్కరూ త్యాగనిరతిని కలిగి వుండాలి. ప్రజలు తలిస్తే సాధించలేనిది ఏదీ లేదనీ, అందుకే అందరూ కలిసికట్టుగా వుండాలనీ ఈ నవల ద్వారా చాటి చెప్పారు రచయిత. ఈ నవలలోని కొన్ని సంఘటనలు చదువుతున్నప్పుడు మన మనసు విషాదంతో నిండిపోతుంది.

**- ప్రజాశక్తి**

తెలంగాణ ప్రజా పోరాటాన్ని చిత్రించిన నవల: ఈ నవల చదువుతుంటే పిడికిళ్లు బిగుస్తాయి. పాఠకుల రక్తం ఉద్రేకంతో ఉప్పొంగిపోతుంది. ఈ రచయిత తెలంగాణాకు చెందిన కమ్యూనిస్టు యోధులలో పేరు పొందినవారు.

తెలంగాణా విముక్తి ఉద్యమానికి సంబంధించిన ఒళ్లు జలదరించే సంఘటనల్ని గుర్తుకు తెస్తారీ నవలలో. ఈ నవల అత్యంత ఆసక్తికరంగా, ఉత్కంఠ భరితంగా, ఉద్వేగపూరితంగా ముందుకు సాగుతుంది. నైజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల వీరోచిత పోరాటాన్ని ప్రతిఫలించిందీ నవల.

**-వార్త**

పత్రికా సమీక్ష: కందిమళ్ల ప్రతాపరెడ్డి తన అనుభవాలను, చదివించే శైలిని సమపాళ్లలో మేళవించి 'బందూక్'ను అందించారు. తెలంగాణ మాండలికం కూడా అన్ని ప్రాంతాల వారికీ హాయిగా బోధపడేలా వుంది. బందూక్ చాలా మంచి ప్రయత్నం. జరిగిన చరిత్రతో పాటు, నాటి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను సందర్భోచితంగా తెలియచెప్పారు. ఎటువైపూ వకాల్తా పుచ్చుకోకుండా యథాతథంగా యిందులో రికార్డు చేశారు. ఎక్కడా అనవసరమైన భావోద్వేగాలు ప్రదర్శించకుండా, ఎంతో సంయమనంతో పాత్రోచితంగా నవలను నడపడంలో రచయిత కృతకృత్యులైనారు.

**- పత్రిక**

'బందూక్' భావితరాలకు క్లాసిక్: ఫ్యూడలిజాన్ని చక్కగా వర్ణించిన ఈ నవలను ప్రతి కమ్యూనిస్టు, ప్రతి ప్రజాస్వామ్యవాది, ప్రతి మానవతావాది తప్పక చదవాలి. ఫ్యూడలిజాన్ని గురించిన సంపూర్ణ అవగాహన కైనా ప్రతి జిజ్ఞాసువు చదవాలి. తెలుగు ప్రజలకు ఒక చక్కని నవల అందించినందుకు ప్రతాపరెడ్డి గారిని అభినందించకుండా వుండలేను.

**- యన్నెస్, విశాలాంధ్ర**

స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శి, ప్రజానాట్య మండలి (ఇప్టా) జాతీయనాయకులు, కవి, నవలారచయిత, జీవితచరిత్రల రచయిత, చరిత్ర రచయిత, బహుగ్రంథకర్త, నిర్విరామ సాహితీవేత్త కందిమళ్ల ప్రతాపరెడ్డిగారి నవల 'బందూక్' పై సాధికారికమైన, సముచిత విశ్లేషణాగ్రంథాన్ని డా॥ కొండపల్లి నీహారిణి రచించారు.


నవలలోని విభిన్న పార్శ్వాలనూ, కథాకథన నైపుణ్యాన్ని, సంభాషణల ఔచిత్యాన్ని ఆమె ఆత్మీయంగా పరామర్శించారు. 'ఈ నవల చదువుతున్నంతసేపు నా హృదయం స్పందించిన విషయాలను పాఠకులతో పంచుకోవాలన్న ఉద్వేగంతో వ్రాస్తున్నదే ఈ విశ్లేషణ' అంటున్నారామె. 'వాస్తవికాంశాలను కళ్ళకు కట్టినట్లు ప్రతాపరెడ్డిగారు వర్ణించారు. పీడిత ప్రజలు పిడికిలి బిగిస్తే, నియంతలు నిద్రపోరన్న నిజాన్ని నిరూపించిందీ నవల' అంటూ సోపపత్తికంగా వివేచించారు నీహారిణి.ఒక ఉద్యమ నవలపై ఉత్తమ విశ్లేషణ గ్రంథాన్ని రచించిన విదుషీమణి, కవయిత్రి, రచయిత్రి, పరిశోధకురాలు డా॥కొండపల్లి నీహారిణికి అభినందనలు. 'బందూక్ నవలానుశీలన'కు స్వాగతం. ప్రచురిస్తున్న 'కన్నా - బన్ను ప్రచురణ'కర్తలకు ప్రశంసలు.

# విలువలు కాపాడే రచనలు రావాలి

**-డా॥కె.వి.రమణాచారి**

హైదరాబాద్, మార్చి 4: విచక్షణను మేల్కొల్పడానికి విలువలు కాపాడే రచనలు రావాలని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు, విశ్రాంత ఐ.ఎ.ఎస్. అధికారి డా॥కె.వి.రమణాచారి పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. అనంతరం కూర శ్రీ శంకరయ్య, లలితమ్మ స్మారక కథా పురస్కారాలను శ్రీ రామా చంద్రమౌళి ("నిర్వాణం" కథలు) ప్రథమ బహుమతి, లలిత వర్మ (ఆణిముత్యాలు కథలు) ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు.

సభకు అధ్యక్షత వహించిన నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతు... కూర చిదంబరం వందకు పైగా కథలు, వెయ్యికి పైగా పుస్తక సమీక్షలు చేశారని అన్నారు. మూడువందలకు పైగా సమీక్షలు



కూర చిదంబరం రచించిన **"సమీక్షా సౌరభాలు", "సమీక్షా సుమ మాలిక"** ఆవిష్కరణలో లలిత వర్మ, బాబూరావు, సుధామ, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, రచయిత కూర చిదంబరం, విహారి, సింహప్రసాద్, శిరేల సన్యాసిరావు. చంద్రమౌళి, రఘుశ్రీ

అన్నారు.

ప్రముఖ రచయిత కూర చిదంబరం రచించిన **"సమీక్షా సౌరభాలు", "సమీక్షా సుమ మాలిక"** గ్రంథాల ఆవిష్కరణ సభ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సౌమిత్రి పబ్లికేషన్స్, విశాఖ సంస్కృతి మాసపత్రిక, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఫిబ్రవరి 28న నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥కె.వి.రమణాచారి పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో జరుగుతున్న తప్పొప్పులను, అసమానతలను అంశాలుగా తీసుకుని రచనలు చేయడం వల్ల రచయితకు గుర్తింపు వస్తుందని అన్నారు. కథ రాసినా, కవిత రాసినా, నవల రాసినా రచయిత గొప్ప మనసుతో ఆలోచించగలిగితే ఆ రచనలను అందరు ఆదరిస్తారని అన్నారు. ఈ వేదికపై ముగ్గురు సాహితీ త్రిమూర్తులు విహారి, సుధామ, సింహ ప్రసాద్‌లు వున్నారని వారి రచనలు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తాయని అభినందించారు.

వారి రచనలు చదువుతుంటే వారికి అంత గొప్ప ఆలోచన ఎలా వస్తుందోనని ఆశ్చర్యమేస్తుందని అన్నారు. అలాగే కూర చిదంబరం లోతైన అధ్యయనం చేసి రచించిన పుస్తకాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని



శ్రీ రామా చంద్రమౌళి కి ప్రథమ బహుమతి అందజేస్తున్న అతిథులు



పొందిన లలిత వర్మనకు ప్రోత్సాహ బహుమతి అందజేస్తున్న అతిథులు

నేటినిజం పత్రికలోనే ప్రచురితమయ్యాయని ప్రతి సమీక్ష రచయితకు సూచనలతో పాటు అభినంద పూర్వక మెచ్చుకోలు వుంటుందని సమీక్ష విలువలతో కూడుకుని వుంటుందని చిదంబరంను అభినందించారు. చిదంబరం రాసిన కథలు కూడా తెలంగాణ అచ్చమైన పదాలతో వాస్తవ జీవితాలను ప్రతిబింబింపజేస్తాయని అన్నారు.

కేఫ్ నిలోఫర్ అధినేత అనుముల బాబురావు, సుప్రసిద్ధ సాహితీవేత్తలు విహారి, సుధామ, సింహప్రసాద్‌లు మాట్లాడుతు.. కథలుఎలా రాయాలో రచయిత బాధ్యతను గురించి వివరించారు. కూర చిదంబరం రచనలపై తమ అభిప్రాయాలు తెలుపుతు అభినందించారు.

కార్యక్రమంలో మానస సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీ, శిరేల సన్యాసిరావు (విశాఖ సంస్కృతి) డా॥ లలితావాణి పాల్గొన్నారు.

నేను కథకుడిగా, రచయితగా ఎదగడానికి మా ఇంటి ముందున్న మాస్టారు, లైబ్రేరియన్ వెంకటరావు గారి ప్రోత్సాహంతోనే అడుగులు వేశానని అలాగే పత్రికా సంపాదకుల సహకారం వల్ల ఎన్నో రచనలు చేయగలుగుతున్నానని కూర చిదంబరం తన స్పందన తెలిపారు. సభను విజయవంతం చేసిన వారందరికీ, ఆశిస్సులు అందజేసిన అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. కూర చిదంబరం దంపతులను అతిథులు ఘనంగా సత్కరించారు.




రచయిత కూర చిదంబరం దంపతులను సత్కరిస్తున్న సుధామ, రఘుశ్రీ, బాబూరావు, బైస దేవదాసు, డా॥కె.వి.రమణాచారి, విహారి, సింహప్రసాద్,రామచంద్రమౌళి, శిరేల సన్యాసిరావు

# విశ్వ భాష తెలుగు-చదివి తీరాల్సిందే..

పుస్తక సమీక్ష

**పు**న్నం అంజయ్య సంపాదకులుగా **'విశ్వ భాష తెలుగు'** పేరిట వెలువరించిన పద్య గేయ కవితా సంకలనం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ పుస్తకాన్ని 2018వ సంవత్సరం నవంబరు మాసంలో ఆస్ట్రేలియాలో జరిగిన ఆరో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిష్కరింపజేయడమే. అంజయ్యగారు తెలుగు భాషా పరిరక్షణ సమితికి జిల్లా అధ్యక్షులే గాక జిల్లా అధికార భాషా సంఘ సభ్యులు. తిరుపతిలో తెలుగు భాషా బ్రహ్మోత్సవాల సందర్భంగా 'తెలుగు తల్లి' కవితా సంకలనాన్ని అందించారు. తెలుగు వెలుగు, దేశభాష లందు తెలుగు లెస్సను ఆవిష్కరించారు. తెలుగు సాంస్కృతిక పునర్జీవనం కోసం, తెలుగు భాషా వికాసం కోసం 92 ఏళ్ళుగా కృషి చేస్తూ, శతాధిక గ్రంథాలకు వెలుగునిచ్చి తెలుగు జాతికి వెలుగు బాటగా నిలిచిన సంస్థ సాహితీ మేఖల, ఇప్పుడు మనకు అందిన తాజా పుస్తకంలో తెలుగు పద్యం, తెలుగు కవిత, తెలుగు గేయం, తెలుగు నానీలు, మినీ కవితలు






**ప్రతులకు:**
సాహితీ మేఖల
ప్రధాన కార్యదర్శి,
6-2-954/2, రోడ్ నెం.3
కాకతీయ నగర్,
నల్లగొండ-508 001
సెల్: 9396610639

తెలుగు సాహితీ లోకానికి అందించిన ప్రముఖ కవుల పేర్లను ప్రచురించారు. వేలూరి శివరామశాస్త్రి గారి కందంతో ప్రారంభించి, శ్రీశ్రీ గారి తెలుగు కవితతో ఈ సంకలనాన్ని ముచ్చటగా ముగించారు. చాలా మంది కవితల్లో పంచదార, తేనె, పాలధార, ఇక్షురసం, చల్లకుండ, మకరంద మధురం, వంటి విశ్లేషణలు మెండుగా చోటు చేసుకున్నాయి తియ్యగా. దాశరథి కలకాలం మన ఐక్యత కాపాడాలి, తెలుగు జాతి గౌరవాన్ని నిలబెట్టాలి అంటూ తెలుగు పతాకం రచనలో పేర్కొంటే, డా॥సి. నారాయణరెడ్డి తెలుగు వాడి లక్షణాన్ని గోంగూరతో ముడిపెట్టి ముచ్చటగా ప్రపంచాన తెలుగు వాడిని మొనగాడిని చేశారు. తెలుగు నాకంటి వెలుగు, నా ఇంటి దివ్వె అని చింతా అప్పల నాయుడు గారు అక్షరాల పాదు అన్నారు. కరుణశ్రీ నగరులందు భాగ్య నగరమె కడులెస్స, దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ ముగించారు. ప్రాణి కోటి అలసటను బాపగల భాష తెలుగు భాష అన్నారు మల్లెమాల. ఎవ్వరేమన్న తెలుగున కెదురు లేదు అంటూ రాసారు రాళ్లబండి కవితా ప్రసాద్. తెలుగు వల్లభుండ తెలుగొకండ, దేశ భాషలందు తెలుగు లెస్స అన్న శ్రీ కృష్ణదేవరాయల పద్యంతో బాటుగా శ్రీనాధ మహాకవి, ఉత్పల సత్యనారాయణాచార్యులు కవిరాజు త్రిపురనేని, చంద్రబోస్, విశ్వనాద సత్యనారాయణ, వంటి ప్రముఖుల రచనలతో బాటుగా నేటితరం మేటి రచయితల కవితల గుభాళింపు ఈ పుస్తకంలో మనం అఘ్రాణించవచ్చును. కవితలన్నీ వన్నె తగ్గని తెలుగు వెలుగులను ప్రసరింపజేసాయి. తెలుగు భాష గొప్పదనాన్ని, కమ్మదనాన్నీ ఆస్వాదించాలంటే ఈ పుస్తకం సరైనదిగా భావించాలి. నానీల్లో కవులు చమత్కారంగా అక్షరాలను చిందులేయించారు. రావి రంగారావుగారు తెలుగు వాళ్ళను కులపిచ్చి కుక్క కరించింది, ఆకరిచిందేదో తమిళుల్లాగా భాషా పిచ్చికుక్క కరిస్తే బాగుండేదంటున్నారు. తెలుగు తల్లి ఫారిన్ వెళ్లింది అంటారు కందేపి రాణీప్రసాద్. చిల్లర భవానీదేవి 'టెల్గు' తల్లికి జాస్మిన్ పూలదండ వేసారు. శంకంబాడి వారి ప్రార్థన పాడుకోడానికి ఎంత బాగుంటుందో మరి. అందుకే ఈ పద్య గేయ కవితా సంకలనాన్ని చదివి తీరాలి.

**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్9949092761



# ఓనం (కథ)

**మిలిటరీ క్వార్టర్స్ ఆవరణలో ఆ ఉదయం ఒక కొత్త కాంతి విరిసింది.**

మబ్బుల పొర వెనుక సూర్యుడు తొంగి చూసే ప్రయత్నంలో ఉండగా, పూలు రాలే శబ్దం నిశ్శబ్దాన్ని పగలగొడుతూ వినిపించింది.

గుమ్మం ముందర కేరళ అమ్మాయి చేచి వంగి పూక్కళం అమర్చుతోంది. తెల్లటి కాటన్ చీర ఆమె భుజాలపై జారిపోతూ, జుట్టులో కొబ్బరి నూనె పరిమళం వెదజల్లుతోంది. పసుపు, ఎరుపు, తెలుపు, నీలం రంగురంగుల పువ్వులు ఆమె వేళ్లలో చేరి, నేల మీద చిత్తరువులా విరబూస్తున్నాయి.

కిటికీ తెరిచి ఆ దృశ్యం చూసిన మమత ఆనందంతో చిరునవ్వు విరబూసింది.

మమత తెలంగాణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతానికి చెందిన ఆర్మీ జవాన్ భార్య. చురుకైన చూపులు, మృధువైన మనసు. ఆమె బయటికొచ్చి పలకరించింది.

"చేచి! పువ్వుల వలయం ఎంత అందంగా ఉంది. మా తెలంగాణలో బతుకమ్మ కూడా ఇలాగే పువ్వులే కదా!"

చేచి ఆగి, మమతవైపు చూసింది.

"అవును మమతా. పండుగలు వేరైనా మనసులు కలుస్తాయి. రా, నువ్వూ ఒక పువ్వు తెచ్చి ఉంచు. నేను ఇంతలో వంటల్లో పడతాను."

అంతలో దూరం నుంచి మరో అడుగుల శబ్దం. నార్త్ రాష్ట్రానికి చెందిన దేవి బుట్టలో పువ్వులు పట్టుకొని వచ్చింది.

"ఏమంటారు అమ్మాయిలు? పూక్కళం కంటే పెద్ద వృత్తం స్నేహమా కాదా!" అని నవ్వింది.

ఆ ముగ్గురూ కలిసి కూర్చొని పువ్వులు అమర్చారు. ఆవరణలో పూల పరిమళం వ్యాపించగా, ఆ క్షణమే దేశ భిన్నత్వం ఒక్క వలయంగా కలిసిపోయింది.

చేచి వంటింటిలోకి వెళ్లింది. జీలకర్ర వేగిన శబ్దం, కొబ్బరి తురిమిన తీపి వాసన, మిరియాల కారం కలసి కొత్త సువాసన పంచాయి.

మమత వంటల గిన్నెలో తొంగి చూసింది.

"ఇన్ని రకాల వంటలు చేస్తావా?"

చేచి చిరునవ్వుతో అంది?

"సద్య అనేది కేవలం భోజనం కాదు మమతా. అరటి ఆకుపై వడ్డించే విందు. వందల ఏళ్ల కేరళ సంప్రదాయం. ఇందులో పులుపు, కారం, తీపి, ఉప్పు అన్నీ కలసి ఒక సమతుల్యం ఇస్తాయి. అదే జీవితం కదా!"

అందరూ సహాయ సహకారాలతో వంటలో నిమగ్నమయ్యారు. దేవి ఆవరణలో పువ్వులు సర్దుతుంటే, మమత బుట్టలో కూరగాయలు సర్దింది. ప్రతి ఒక్కరి చేతిలో పనులు, హృదయంలో ఉత్సాహం.

"చేచి, ఓనం వెనుక ఉన్న కథ చెప్పవా?" అని మమత ఆసక్తిగా అడిగింది.

చేచి ఆగి మృదువైన స్వరంతో వివరించింది.

"మహాబలి చక్రవర్తి పరిపాలనను స్వర్ణ యుగమని పిలుస్తారు. సమానత్వం, శాంతి, సద్భావన ఆయన రాజ్యంలో సహజం. ఆయనను విష్ణువు వామనావతారం రూపంలో పరీక్షించినా, మహాబలి భూమి అంతా అర్పించాడు. కానీ సంవత్సరానికి ఒకసారి తన ప్రజలను దర్శించడానికి తిరిగి వస్తాడని విశ్వాసం. ఆ జ్ఞాపకమే ఓనం."

మమత ఆలోచనలో మునిగిపోయి అంది.

"నిజమే చేచి! పండుగల సారాంశం సంప్రదాయాలను నిలబెట్టుకోవడమే. తెలంగాణలో బతుకమ్మకూ అదే మహత్తు ఉంది. గత సంవత్సరం ఇక్కడ బతుకమ్మ ఆడిన రోజులు ఇంకా కళ్లముందే ఉన్నాయి."

ఆ సమయానికి పిల్లలు ఆవరణలో కేరింతలతో మెలిగారు.

టగ్ ఆఫ్ వార్ మొదలైంది. చిన్న చిన్న గళాలు ఆకాశాన్నంటాయి.

"వద్దురా? లాగు లాగు!" అని కేకలు.

మధ్యలో ఒక ఆంటీ చిలిపిగా అడిగింది "మీది కేరళ కదా?"

మమత నవ్వుతూ అంది,

"కాదు ఆంటీ, మాది తెలంగాణ! కానీ మా పిల్లలు, మా వంటలు ఈ రోజు కేరళ పండుగలో భాగ స్వామ్యమే "

అరటి ఆకులు గుమ్మం ముందు పంచబడ్డాయి. వంటగదిలోనుంచి వరుసగా వంటకాలు వచ్చాయి..

పులిసేరి, అవియల్, తూరన్, కూటుకర్రీ, కిచడి. ప్రతి వంటకం వేర్వేరు రుచి, ప్రతి రుచి కొత్త అనుభూతి.

చివరగా వడ్డించిన పాయసం విందు తియ్యని శిఖరానుభూతికి చేర్చింది.

ఆ వాసనలో, ఆ రుచిలో ఒక మంత్రం ఉంది. అది కేరళ సంప్రదాయ వంటకళకే కాదు, భారతీయ అతిథి సత్కారా నికి ప్రతీక.

అందరూ భోజనంలో మునిగిపోయిన వేళ, స్నేహిత్ సంప్రదాయ ముందు ధరించి ముందుకొచ్చాడు.

"వనక్కం, ఎల్లావర్కుమ్ నమస్కారం!" అని మలయాళంలో పలికాడు.

అందరి కళ్లు విస్తారంగా తెరుచుకున్నాయి.

"ఈ బాబు కేరళోడేనా?" అని ఎవరో ఆశ్చర్యపోయారు.

మమత గర్వంగా నవ్వుతూ అంది

"లేదు, మాబాబు తెలంగాణోడు!"

ఆ ఒక్క మాట విన్నవెంటనే గదంతా చప్పట్లతో మార్మోగింది.

పాయసం రుచి చూస్తూ ఉత్తర రాష్ట్రపు అమ్మాయిలు తమ తమ పండుగల జ్ఞాపకాలను పంచుకున్నారు.

"మా దగ్గర దీపావళి రాత్రంతా వెలుగుల పండుగ," అని ఒకరు అన్నారు.

"మా దగ్గర హోలీ రంగుల తుఫాను," అని మరొకరు నవ్వారు.

అప్పుడే మమత మధురంగా అంది.

"మా రాష్ట్ర పువ్వు తంగేడు. మీది రాలే పువ్వు. పోలికలు చూడండి?మనమందరం వేర్వేరు ప్రదేశాల వారైనా, మన సంస్కృతి మూలం మాత్రం ఒక్కటే."

ఆ మాటలు ఆవరణలో గాలి తాకిన చప్పుడు లాగా అందరి హృదయాల్లో మ్రోగాయి.

సూర్యుడు అస్తమిస్తున్న వేళ ఆకాశం నారింజరంగులో మెరిసింది. ఆ రోజు మిలిటరీ క్వార్టర్స్‌లో జరుపుకున్న ఓనం, కేవలం కేరళ పండుగగానే కాక, భారతీయ సంస్కృతి వైవిధ్యానికి ప్రతీకగా నిలిచిపో యింది.

చివరగా అందరూ ఒకే స్వరంతో గళం కలిపారు.

"భిన్నత్వంలో ఏకత్వమే మన బలం! మేమందరం భారత మాత బిడ్డలమే!"



**-డా॥ పెరుక రాజు**
7810032847

# జీవితానుభవాలను తెలియజేసే భావచిత్రాలు "నానీ కపోతాలు"

**చిం**తా రాంబాబు గారి **"నానీ కపోతాలు"** లేదా ఆయన రాసిన నానీలు మానవ జీవనంలోని వివిధ పార్శ్వాలను ప్రేమ, తల్లి, యువత, అంతర్గత పోరాటం, సామాజిక విలువలు, రైతు జీవితం మితమైన పదాలలో, ఘనమైన భావంలో ప్రతిబింబిస్తాయి. ముందుగా "నానీ" అంటే ఏమిటో చూద్దాం ..నానీల గురించి..


సుప్రసిద్ధ కవి డాక్టర్ ఎన్ గోపి గారి సృష్టి నానీలు ఇప్పటివరకు దాదాపుగా వేలమంది కవులు స్పందించి రచించారు. తక్కువ పదాలతో ఎక్కువ అర్థాన్ని అందించాలనేదే వీరి ఆశయం.

ఈ నానీలు ఇప్పటికే దేశవ్యాప్తంగా విస్తరించబడ్డాయి. తెలుగు సాహిత్యంలో హైకూల తర్వాత స్థా నాన్ని ఆక్రమించి అందరి దృష్టిని ఆకర్షించిన ఈ నానీలు ఈ రోజు మరొ కవి "చింతా రాంబాబు" తమ నానీ కపోతాలు అనే శీర్షికతో రచించారు. ఇక వీటి వివరణలోకి వెళితే ..

"నానీ" అనేది తెలుగు చిన్న కవితా రూపం. ఇది హైకూ జపాన్ కవితా రూపం ప్రభావంలో పుట్టినా, తనదైన తెలుగు వాసన కలిగి ఉంటుంది. సాధారణంగా 4 పాదాలు (లైన్లు), 20 నుండి 25 అక్షరాల మధ్య, క్షుణ్ణమైన భాషలో ఒక ఆలోచన లేదా భావాన్ని మలచే కవిత.

నానీ అంటే 'చిన్నది కానీ నాణ్యమైనది' అన్న భావం. చింతా రాంబాబు గారి "నానీ కపోతాలు" ఈ రూపానికి చక్కని ఉదాహరణలు. అవి మానవత, ఆత్మపరి శీలన, ప్రేమ, ప్రకృతి వంటి అంశాలను మృదువైన కవితా భాషలో చెబుతాయి.

**"ఆవెకు/ఎదుటి వారి ఆకలి తెలుసు/ ఎంతైనా/అమ్మ కదా"**




ప్రతులకు: చింతా రాంబాబు
సెల్:99491 78092

ఈ నానీలో తల్లితనంలోని అమో ఘమైన సానుభూతి ప్రతి బింబిస్తుంది. తల్లి తన ఆకలిని మర్చిపోయి ముందుగా పిల్లల ఆకలిని గుర్తిస్తుంది. "ఎంతైనా అమ్మ కదా'' అనే చివరి పాదం సర్వసాధారణమైన వాక్యం అయినా దానిలో ఉన్న ప్రేమ, త్యాగం, మమకారం అపారమైనవి. ఒక వాక్యంలోనే తల్లితనం అంతా ఇమిడిపోయింది.

**"యువత/వ్యసనాల వేటలో/కన్నవారు/ దుఃఖాల ఊటలో''** ఇక్కడ రచయిత సమాజంలోని యువత ప్రవర్తనను చురుకు గా చూపించారు. ఆధునిక వ్యసనాలు మత్తు పదార్థాలు, ఫోన్లు, ఫ్యాషన్, ఖాళీ ఆనందాల వేట వీటి వెనక పరిగెత్తే యువతను చూస్తూ తల్లిదండ్రులు బాధపడుతున్నారు.

"కన్నవారు దుఃఖాల ఊటలో" అనే పాదం ఆ వేదనను గాఢంగా వ్యక్తం చేస్తుంది. మరొక చోట ఇలా అంటారు. **"అంతర్గతంగా నిత్యం/యుద్ధం జరుగుతూనే ఉంది/నాతోనే/నాకు"** ఇది మనసు లోపలి పోరాటాన్ని ప్రతిబింబించే లోతైన నానీ. మనిషి తన మనస్సులోనే ప్రతి రోజూ యుద్ధం చేస్తుంటాడు. మంచిదీ చెడ్డదీ, ఆశయమూ వాస్తవమూ, మనసూ మాయలూ ఇవన్నీ పరస్పరం పోరాడుతుంటాయి. చివరి పాదం "నాతోనే నాకు" ఆ అంతర్గత ఘర్షణను అద్భుతంగా సారాంశం చేస్తుంది.

**"దంపతుల్లో/అవగాహనా లేమి/ విడాకులా/అయ్యో ఇదేమి"** ఇది కుటుంబ సంబంధాలపై వేదనను వ్యక్తం చేస్తుంది. అవగాహన, పరస్పర గౌరవం లేకపోవడం వల్ల దంపతుల మధ్య విభేదాలు పెరుగుతాయి. "విడాకులా అయ్యో ఇదేమి" అనే పాదం ఆ బాధను సాధారణ భాషలోనే గాఢంగా చెబుతుంది. చిన్న వాక్యాల్లోనూ సామాజిక వాస్తవం ఉట్టిపడుతోంది.

**"మట్టి/పరిమళం వెదజల్లింది/ అన్నదాత/చెమట స్పర్శ అది"** ఇది రైతు జీవిత సౌందర్యాన్ని గానిస్తూ ఉంటుంది. మట్టి పరిమళం వెనుక ఉన్నది రైతు చెమట. ఆ చెమటలో జీవన గీతం ఉంది. భూమి వాసన, రైతు కష్టం, అన్నదాత గౌరవం ఇవన్నీ నాలుగు పాదాల్లో కవిత్వమై మిళితమై ఉన్నాయి.

మొత్తం చూస్తే చింతా రాంబాబు నానీలు చిన్న పాదాల లోపల పెద్ద భావాలను నింపినవి. తల్లి ప్రేమ నుంచి రైతు చెమట వరకూ, మనసు పోరాటం నుంచి సమాజం బాధ వరకూ ఆయన పదాలు అర్థవంతమైన కవిత్వంగా ప్రతిధ్వనిస్తాయి.

మొత్తం గా చింతా రాంబాబు గారి నానీలు మనిషి జీవితంలోని అనేక రంగులను అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. తల్లి మమకారం, యువత మార్గభ్రంశం, అంతర్మధనం, దాంపత్య సంబంధాల సున్నితత్వం, రైతు చెమట పరిమళం ం ఇవన్నీ ఆయన చిన్న పదాల లోపల పెద్ద భావాలుగా మెదులుతాయి.

భాష సరళంగా ఉన్నప్పటికీ భావం లోతైనదిబీ ఆలోచన స్పష్టంగా ఉన్నప్పటికీ మనసును తాకే గాఢత కలిగి ఉంటుంది. ఈ నానీలు కేవలం చిన్న కవితలు కాదు, జీవితానుభ వాలను ప్రతిబింబించే భావ చిత్రాలు.



**-శైలజామిత్ర**
9290900879

# సప్త పదులు

**త**క్కువ
ఎక్కువ

మాట్లాడు,
విను అప్పుడే
నీవంటే
మక్కువ

**-కాళిదాసు సుబ్బయ్య**
8790607706

**సు**గుణము
దుర్గుణము

ఎంచలేకుంటే
రాబోయే పరిణామాలకు
మనమే
కారణము

**-ఆచార్య యేడిద వెంకట సుబ్రహ్మణ్యం,**
హైదరాబాద్

**జ**వం
జీవం

సకలప్రాణకోటికి
మేలుచేయకున్న
సరే...
కల్గివుండాలి
సద్భావం.

**-శ్రీమతి పద్మావతి గన్నోజు**
9014492259

**పొ**లాలు
హలాలు

నిండుతున్నాయి
రైతుల కష్టాలు
కన్నీటి
జలాలు

**-ప్రహారాజు రాధాకృష్ణ**
విజయనగరం

**వి**చక్షణ
క్రమశిక్షణ

నేటి
యువత
పోకడలకు
లేదు నియంత్రణ.స

**-బి స్వాతి కరుణాకర్**
హైదరాబాద్

# మనసును మండెబోసిన అక్షర అంబటి

**అ**మ్మను కీర్తించి అక్షరీకించినట్లుగా సాహిత్య సమాజం నాన్నను అక్షరీకరించలే... అమ్మ నాన్న సమానమైనప్పుడు నాన్న అక్షరంలో వెనకబడ్డాడు. నాన్నతో వేలు పట్టుకుని జీవితాంతం నడిచిన బిడ్డలు..

నాన్న మీద కొన్ని ఫిర్యాదులు ఉంటాయి. కోపాలు తాపాలు అలకలుంటాయి. నాన్న త్యాగాలను తలపోయడంలో కవి అంబటి వెంకన్న ముందున్నాడు....

కరుణ సముద్రం, ప్రేమసముద్రం కన్నీటి సముద్రంగా కవి ప్రజా గాయకులు అంబటి వెంకన్న "నాన్నే నా చిరునామా' దీర్ఘకవితను అక్షరీరించాడు. నాన్న జీవితంపై ఒక దీర్ఘకవిత రాయడం అంతా ఆశామాషి కాదు. సులువైన బాట కాదు. అక్షరాలు మొదలుపెడితే కన్నీరు కదులనివ్వవు. ధైర్యంతో మనోనిబ్బరంతో రాసిన ఈ దీర్ఘకవితాక్షరాలూ నాన్నకు మెడనిండా సరాలుగా చేసి వేసి నివాళులర్పించారు.

చెరువు చేపలే జీవనాధారంగా బతికిన బెస్త తెలుగు కుటుంబ జీవిత గాథ ఇది. తెలుగు సాహిత్యంలోకి శ్రామిక కులాల నాయన జీవితాన్ని

ఒంపిన అంబటి వెంకన్నకు సదా వేల వందనాలు.

నాన్న చేపలు పట్టిండు. వ్యవసాయం చేసిండు బర్రెలకు గడ్డి తెచ్చిండు. ఒడ్డు వరాలు చెక్కిండు. తిర్నాల తేరు గుంజిండు.నాగర్జున సాగర్ నిర్మాణంలో కూలిగా పనిచేసిండు. చెప్రాసిగా బడి గంట కొట్టిండు. కూలి చేసిన శ్రామిక జీవితం నాయనది. అంబటి వెంకన్న నాన్న ఎక్కడెక్కడ పని చేశాడో ఎట్లా జీవితాన్ని సాదిండో, పూసగుచ్చినట్లు నాయన జ్ఞాపకాలు మరిచిపోకుండా రాశాడు.

సదివింది నాలుగే అయినా లోకజ్ఞానంలో గురువుకు అయ్య/ చెప్పని పాఠానికి చేయని కష్టానికి/ గురుదక్షిణ అడిగేటోడు గాదు/ అస్త్ర శస్త్ర విద్యలు నేర్పి /ఆపదలో అక్కెరకు రాకుండా/ శపించే గురువసలే కాదు/ఏవో నాలుగు బుద్ధి మాటలతో/ మనిషితనాన్ని బోధించి/ మానవత్వాన్ని చాటించిన/ అపరసాధువు మా నాన్న/ అంబటి గురువయ్య మా నాన్న...


ఒక గంట చదువుకు ఒకరోజు కోచింగ్ కు వేల ఫీజులు అడిగే కాలం కానీ, చెప్పని పాఠానికి చేయని కష్టానికి జీతం అడిగేవాడు కాదు నాన్న. నాన్న నిజాయితీని అద్దంలో చూపాడు. ఇంతకన్నా మానవతా ఇంకేముంటుంది. మనిషి తనాన్ని బోధించిన అపర సాధువు మానాయన అని చెప్పడం గర్వకారణం.

అంబటి వెంకన్న స్వయంగా కవి. ఇప్పటికే నాలుగు కవితా సంపుటాలు వెలువరించాడు. గేయ రచయితగా . పాటలు నిప్పుల రాశిలా రాసిపోశాడు. తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున గజ్జగట్టి ఆడుతు పాడాతూ రాశాడు. కులవృత్తులపై అనేక పాటలు ఆయన సొంతం. **"జిల్లెడు పూలు, గోగుమల్లెలు''** పాటల పొత్తాలు పరిశీలించినట్లయితే వెనుకబడిన జీవితాలు అస్తిత్వ కులాలపట్ల ఆయనకు అత్యంత అభిమానం. ఆయన వృత్తిలో వలవిసిరి చేపలు పట్టాడు. ఇతర కులాల వృత్తి జీవితాల్ని వదిలిపెట్టకుండా సమస్త కులవృత్తులపై శ్రామిక గేయాలు రాసిన సహృదయుడు సమున్నతుడు అంబటి వెంకన్న.

నాన్న దుఃఖాన్ని నలుబైఐదు పుటల్లో నడిపిన నడిచిన ఒక విలువైన కవిత. తీరని దుఃఖాన్ని కొలవలేని రక్తబంధం ,అనుబంధం అభిమానాన్ని ఒక మాటతో ఒక అక్షరంతో ఒక వాక్యంతో ముగించేది కాదు. నాన్నతో నడవడం అంటే నది వెంట నడవడమే...

అనేక జ్ఞాపకాలు కాలువలై వాగులై అలుగులై దుంకుతాయి. తైద జొన్నంబలిలో ఉల్లిగడ్డ పచ్చి మిరపకాయలు నంజుకుని తింటుంటే ఎంత కమ్మగా ఉంటదో నల్లగొండ భాషాయాసను మధురంగా ఈ దీర్ఘకవిత నిండా నింపాడు. నాన్నతో ముచ్చట్లన్ని నక్షత్రాల్లా వెలిగించాడు.

ఈ దీర్ఘకవితకు "నాన్నే నా చిరునామా" అని పేరు పెట్టడం ఎంతో సముచితం






**ప్రతులకు:**
అంబటి వెంకన్న
సెల్:9966376072

నాన్న ఆటలు, పాటలు, ముచ్చట్లు, నాన్న పెద్దరికాలు. పలుకరింపులు సోదర సౌభ్రాతృత్వాలు,నాన్న మానవతలు, ఆదరణలు, పచ్చి చేపల గంపలా, వట్టి చాపల కమ్మని కవుసు విందులన్నీ అణువణువున నాన్నపై అక్షర రవళులై చెరువంతా వలవిసిరినట్లు నాన్న జీవితమంతా గూడల్లాడు.

ఒడ్లెంకటేశం,కుమ్మరి రాములు,మాదిగ పక్కీరయ్య,కల్లు రామయ్య, తుపాకీ జంగయ్య బహుజన దోస్తులతో నాయన నడిచే విధానాన్ని ప్రేము కట్టి చూపాడు.ఒక్కొక్క అక్షరం పరక చేపలా కొడిపె పిల్లలా వివిధ శీర్షికలతో వల నల్లినట్లే నాన్న జీవనాన్ని కథల్లా అల్లాడు.

**పడుసుదనం పక్కకేసిన/మూడుముళ్లబంధం/పదమటింట్ల పాలుతాగి/తెల్లవార్లు సరసాల జాతర/కాలుదువ్వి లెంకలుగొట్టె కామునికోలాటం/**

**అందాన్ని పిండంగా మార్చిన/ అసలు బ్రహ్మ నాన్నే కదా..**

**సూర్యచంద్రులు సుక్కలను ఎత్తుకున్నట్టుంటడు/ గంగను నెత్తిన మోస్తున్నట్టుంటడు/ పొద్దున మాపనక/ పోటెత్తిన గంధాలను నిలువరిస్తున్నట్టుంటడు..**

**నాన్నే నా చిరునామా/ నా కవిత్వంలోకి వచ్చిన అతిథి/నా అక్షరాలలో ఒదిగిన తెలంగాణ భాషా పెన్నిధి....**

ఇలాంటి వాక్యాలు గుండెలను హత్తుకొనే విధంగా ఈ దీర్ఘ కవితా నిండా చింతవోలకాయలు పక్కున నవ్వినట్లు చాపలు ఎదురేదినట్లు మనకు ఎదురొస్తుంటాయి.

ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ అంబటి గురవయ్య.తన తండ్రి చెప్రాసి కొలువైనా మనుషులు జీవితాలను చదివిండు. తీరికలేని దౌరాలు. ఎవరికి చిన్న గాయమైనా పసిపిల్ల వాడిలా కన్నీళ్లు పెట్టుకుంటాడు. ప్రపంచం ఎంత పెద్దగున్నా నాన్నకు ఊరే ప్రపంచం. వడ్ల దాతి ముచ్చట్లలా చాకిరేవు సుద్దుల్లా, రచ్చకట్ట ఒడువని పంచాయతిలా మోటలు ఒడిసినా పాట ఆపని నాయన జీవితం.

"కొత్త పొద్దుకు కోండ్రలేస్తడు నాన్న... కొమురెల్లి మల్లన్న మీసం దిప్పినట్టుంటడు. జిల్లా పరిషత్ అటెండర్ మా నాన్న.ఊరంతా కలెదిరిగొస్తడు నాన్న.ఎత్తులు జిత్తులు తెలువనోడు మా నాన్న.

స్వచ్ఛమైన మనిషి మా నాన్న. మాటకు కట్టుబడి బతికినోడు మా నాన్న".

నాయన ఆలోచనలను అడుగులను, ఊహలను వ్యక్తిత్వాన్ని, గాంభీరితను గాయాల్ని ఇలా నాన్న గొప్పదనాన్ని ప్రతి పేజీలో చాటాడు.

**"అంతా నీ గుండె బలమేగా నాన్న/ నువ్వు నా పక్కనే ఉన్నావన్నా ధైర్యమేగా నాన్న...**

నాన్నయొక్క ధైర్యాన్ని యాది జేసుకున్నాడు.

అనారోగ్యంతో నాన్నకు వైద్యం చేయడానికి చేయించడానికి పెద్దాసుపత్రిలో శేరిక్ చేసినా.. నాన్న వెల్లిపొయాడు నిలబడలేదు."పట్నం డాక్టర్లను నమ్మినా పానం దక్కలేదు.. " గొల్లగూడెం దావకాండ్ల కన్నుమూసిండు. అర్థరాత్రి కుప్పగోట్టిన సప్పుడిన్న నేను నీ గుండె సప్పు డాగిన సంగతి కనలేకపోతి నాన్న....కలలో దప్ప కనపడని నాన్న, వినపడని లోకంలో నాన్న, కనపడని శూన్యంలో నాన్నంటు.... అక్షరమక్షరం కన్నీరు మున్నీరైెండు.

పెదనాన్న చిన్నాన్న మామ, కక్కయ్య ఆత్మీయ వరుసలతో సాగిన జీవితం నాన్నది. బాపని పంతులు బైండ్ల మామల నుంచి కమ్మరి సత్తయ్య ప్రేమ, త్యాగం కులవృత్తుల సత్సంబంధాలు, ఊరి సంస్కృతిని కళ్లకద్దుకున్నాడు. నాన్న లేని ఊరు ఉంటుందా? "శివుని గుడి పీర్ల కొట్టం ఆంజనేయుని గుడి అవతలూరు యివతలూరు అంతా నాన్నే"...

గుండెల మీద ఆడించి గుర్రమై ఇల్లంత తిప్పిన నాన్న. పచ్చి శెనక్కాయలు ఉడకపెట్టి బుడ్డలు కాల్చి తినిపించిన నాన్న. బడికి పంపించిన నాన్న. పెసరకాయలు సద్ద కంకులు బుడంకాయలు ఒకటా రెండా ఎన్నింటినో తల్పుకతల్పుక వలబోసిండు. ఎరకజేసుకున్నాడు. నాన్న ఎక్కడున్నాడని ఏమైపోయాడని ఇక తిరిగి రాడని గుండెలవిసేలా రోదిస్తున్నాడు.

రాముడైనా రహీమైన యేసోబైనా నాన్న చిరునామనే.నాన్న అంబటి గురవయ్య వెళ్లిపోయిన ఐదేళ్లకు కొడుకు అంబటి వెంకన్న నాన్న జ్ఞాపకాల బరువును పచ్చి కట్టెలమోపులా మోస్తూ, నాన్న యాదులను తవ్వి ఎల్లమ్మకుండలా తలకెత్తుకున్నాడు. బాటాగిపోతే పాటాగిపోతే నాన్న కవిత ఆగిపోతుందా? కాదు కాదు సాగిపోతుంది.... తెల్లవారుజామున ఏటి అలల పాటలా మునుగోడు వాగులా ఉప్పొంగింది. నాయనలు మళ్ళీ మళ్ళీ పుడతారు అక్షరాల రూపంలో బిడ్డల రూపంలో....

వెంకన్న చిరునామంతా పల్లె నేపథ్యం. వ్యవసాయం నాయన తోమిన తొమ్మిది కోళ్లబావి మోటబొక్కెన, పసులుగాసి పలుపులు పేణి, చేతులల్ల బొగ్గలు ఇవన్నీ మనల్ని ఒక ప్రవాహంలో తీసుకపోతాయి. బర్లు గొర్లు, కొట్టం ముసురు తిప్పలు తొలిచూరు కొడుకు తొలిప్రేమను అంబటి వెంకన్న ఏ ఒక్కటి మరువలే....

నాన్నే నా చిరునామా

అంబటి వెంకన్న చిరునామానే కాదు.నల్లగొండ చిరునామా. తెలంగాణ చిరునామా. అనేక అవమానాలు వివక్షతలు ఆధిపత్యాలను ఎజ

ఎదు ర్కొన్న చిరునామా. నీళ్లు లేని కూలి దొరకని చిరునామ. తీరని ఎతల చిరునామా. కదిలియకుండా సగురం చేసిన కన్నయ్య మామ, కమ్మరి సత్తయ్య చిరునామా. సబ్బండ వృత్తుల చిరునామా అంబటి వెంకన్న నాన్నే నా చిరునామా.

నేటి సమాజంలో బిడ్డలు తల్లిదండ్రులు ను వృద్ధాశ్రమాల్లోకి తోసేస్తున్న కాలంలో..నాన్నను ఎలా చూడాలి ఎలా ఉండాల్నో స్ఫూర్తివంతంగా సాగిన కవిత.

తెలంగాణ చిరునామాను మన చేతుల్లో చందమామలా ఉంచిన అంబటి వెంకన్న ధన్యుడు.

ఎన్ని దీపాలు ముట్టిచ్చినా నాయన ముట్టించిన దీపములా ఉండదు ఇంటి దీపము నాయననే కదా ! నాయన

తప్పెట చిటుకులా గలగల మాట మల్లెపువ్వుల నవ్వు నుదుట సుక్కబొట్టు

తెల్లటి పాలిస్టరు పంచె

భుజం నిండా సెల్లా

గుడి ముందు ధ్వజస్తంభంలా మెరిసె ఆరుగాలం అరకై శ్రమించిన చెమటదారల గింజలె

ఆకలిని తరిమె అన్నంగిన్నె నాన్న

నాయన అంటే మామిడి తోరణం. వ్యవసాయ క్షేత్రం.దసరా సంక్రాంతి, ఉగాదుల సమ్మేళనం. సూర్యుడు తన చుట్టూ తాను తిరిగితే నాయన ఇంటి చుట్టూ తిరుగుతాడు.


సూర్యుడు కాలానికి వెలుగు నాయన ఇంటికి వెలుగు. ఒక గంట ఇల్లిడ్వడు .బిడ్డింటికి, చుట్టాలింటికి పోయినా నక్కయ్యేటాల్లకు కోడిపిల్లలా ఇంటిలో ఉండాల్సిందే..ఇంటిని జేబులోనే వేసుకొచ్చినట్లు

పోదాం పద అంటూ గాబరగాబర తొందర తొందర...ఇల్లంటే నాయన కదా.......

ఆపతి సంపతి మరిసి ఇంటి గురించే పలువరింతలు, విశ్వమంత ప్రేమ, సాగరమంత సంసారం సహనమూర్తి నాయన పోయాక తెలిసింది..

నాయనంటే ఊరు కదా..

ఆరుదశాబ్దాల అంబటి వెంకన్న అలిసిపోకుండా అయ్యను యాది చేసుకోవడం ఆయనకే చెల్లుతుంది. ఉద్యమ సహచరుడు నల్లగొండ మిత్రుడు నిప్పుల నెగడుమనసును మండెబోసి నాలుగు అక్షరాలతో నాన్నను వెలిగించిన కవి అంబటి వెంకన్నకు అభినందనలతో..



**-వనపట్ల సుబ్బయ్య**
9492765358

# ఇతిహాసం

**గు**డిలో దేవుడు
గుడిసెలో జీవుడు
దేవుళ్ళకు కల్యాణాలు
జీవులకు లంఖణాలు
అన్న రాశులు అక్కడ
ఆకలి గోసలు ఇక్కడ
కాషాయ వేషాలు
పీఠాలు పటాటోపాలు
గుడుంబా గురువులు
హిరణ్యాక్ష ఆకృత్యాలు
నాయకుల అండదండలు
సన్యాసులు
సమ్మోహన విన్యాసాలు
భక్తినిబట్టి దక్షిణ స్వీకరణలు
తాయెత్తులు కుయుక్తలు
తల్లిదండ్రుల సైతం మార్చే
మతమార్పిడి సైతానులు
దేవుడున్నాడో లేడో
ఇదో సందేహ ప్రేతం
ఆస్తిక నాస్తిక ఉన్మాద వాదాలు
మాధ్యమాల్లో చర్చల ప్రసారాలు
రాజస తామస ప్రదర్శనలు
సందేహ నివృత్తికి మాత్రం
పూర్ణాహుతి.



**- సోమయాజుల సుబ్రహ్మణ్య శర్మ**
సెల్: 9346671524

# ఎవడు నిలుస్తాడు

**చ**దవడం ఒక్కటే కాదు
చదివినదాన్ని బయటికి
వ్యక్తీకరించే క్రమంలో మన
ఇజాన్నీ జోడించడం!
మన వ్యక్తిత్వాన్ని
నిలబెట్టుకోవడం
చాలా చాలా అవసరం!
సమాజాన్ని ప్రభావితం
చేసేవాడే పది కాలాల
పాటు నిలుస్తాడు.!
లేకపోతే కాల గర్భంలో
కలిసిపోతాడు!
ఊరకే పేలవంగా రాసే
రాతలు!
ప్రాధాన్యత లేని అక్షరాల
కూర్పులు!
కాలప్రవాహంలో
కొట్టుకుపోతాయి
కాకపోతే మన అక్షరాలు
అచ్చులో
చూసుకున్నామన్న
సంతృప్తి
మిగులుతుంది!




**-డా॥ దాశరథుల నర్సయ్య**
9390919100

నాటి తరం వారి కథలు నేటి తరానికి

## కథల వంతెన

# అపశ్రుతి

(కథ)



రాత్రి కోడి బద్ధకంగా "కొక్కొరోకో" అని కూసింది. వులిక్కి పడింది జానకి. మూడో ఝామురం ఎదలో ఏదో బాధ దేవినట్లని పించింది.

చిమ్నీ లేని దీపం. మాటి మాటికి ఆరిపోవ యత్నిస్తుంటే జానకి చేతులడ్డుతూ కాపాడుతున్నది. తన బ్రతుకులాగా దీపం కూడా కొడిగట్టుకుపోతోంది. జానకి గుండె ఝల్లుమంది. 'మూడుగంటల రాత్రయినా ఇంకా ఆయన రాలేదేం?' అనుకుంది.

గబ్బిలం ఒకటి రివ్వున తలను రాచుకుంటూ వెళ్ళింది. పగలంతా కష్టించి పనిచేసిన కూలీ వాడంతా ఆదమరిచి నిద్రపోతున్నది. కుంటీకుక్క "బాలూ" కూడా అరచిఅరచి నిద్రపోయింది. జానకికి నిద్ర రావటం లేదు. మనసేదో అపశ్రుతి పలుకుతున్నది. దీపంచుట్టూ పురుగులేవో చేరాయి. ద్వారానికి చేరగిలబడి అలానే ఆలోచనల్లో మునిగిపోయింది.

ఆయన వచ్చేవేళయింది. కాని, ఇంకా రాలేదు. ప్రమాదవశాత్తు యేం.. మంగళ సూత్రం, బాధగా మెలికలు తిరిగినట్లయింది తీసి కళ్లకద్దుకుంది.

'జీవితంలో సుఖించాలని అందరికీ అభిలాషే. కాని అది అందరికీ సాధ్యం కాదు. ఆ మజిలీని చేరి అలసట తీర్చుకొని, సుఖపడాలన్న బాటలో ఎన్నో ముళ్లపొదలు..ఎన్నో డొంకలు!' ఇంటిలోని దారిద్ర్యం తనను చూసి నవ్వుతున్నట్లనిపించింది.

సాయంత్రం గోపాలం రావటమే ఎంతో హుషారుగా వచ్చాడు. వస్తూనే, "జానకీ మన దారిద్ర్యం ఈనాటితో ఫైసలా! నువ్వూ నేనూ రాణీ రాజులం తెలుసా?" అన్నాడు.

జానకికి అర్థం కాలేదు. అంతస్తును మించి ఆలోచించటం ఆమెకు చేతనవదు.

అమాయకంగా భర్త మొఖంలోకి చూసింది. నెగళ్ల మంటలాంటి వెలుగేదో భర్త కళ్లలో ప్రస్ఫుటమయింది ఆమెకు. ఆయనే మొదలుపెట్టాడు. "ప్రపంచంలో కష్టపడి పనిచేసేవాడికి సుఖం వుండదు జానకీ! అందుకే అన్నారేమో న్యాయంగా బ్రతకాలంటే న్యాయం మీద మమత వదులుకోవాలని. జానకీ! ఇన్ని రోజులు కష్టపడి పనిచేసి నేను వెనకేసిందేమిటి చెప్పు? ప్రపంచంలో సుఖంగా బ్రతకాలని వుంటే అది న్యాయ మార్గాన పొసగదు. అంచేత..." ఆపి భార్యం మొఖంలోకి చూసాడు. జానకికి కొద్దికొద్దిగా అర్థమౌతున్నది. చెప్పమన్నట్లు భర్తకేసి చూసింది.

ఇవ్వాళ సూర్యనారాయణ అనే కంపోజిటర్ నన్ను కలిసాడు జానకీ! నాలుగు వంద నోట్ల కట్టలు సీరియల్ నంబర్లు వేసినవి, ఎకౌంటులో తప్పువ్రాసి ఓచోట దాచాడట. ఇవ్వాళ రాత్రికి తీసుకురావాలిట. నాకు సగం వాటా ఇస్తానన్నాడు.

జానకి హృదయం వేగంగా కొట్టుకోసాగింది. భర్త చేసే పనేమిటో తెలిసిపోయింది. 'దొంగతనం'. కడుపులో శులాల్లాగా గ్రుచ్చసాగాయి ఆ మాటలు.

మౌనంగా వడ్డించింది.

"నాకు తెలుసు జానకీ! నువ్వొప్పుకోవని. కాని మనవేపూ, మన పిల్లల వేపూ వొక్కసారి చూడు. మన కడుపున పుట్టి ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నారో! వొక్కనాడైనా కడుపునిండా కూడు పెట్టగలిగామా? అలాగని రెక్కలు దాచుకున్నామా? అదీ లేదు. పగలనకా రేయనకా గొడ్డులా పనిచేస్తున్నాం అయినా నెలకు వంద రూపాయలు మించి కళ్ళచూడలేం. దీంతో మనమేం బ్రతగ్గలం? మన పిల్లల భవిష్యత్తునే పూలబాటల్లో నడిపించగలం?" పొలమారింది ఆయనకు.

భర్తకు నీళ్లందించింది.

"ఎంతో ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఇరువదివేలంటే మాటలు కావు. మళ్ళీ మనం ఇంత మొత్తం జీవితంలో కనీసం వినటానికి కూడా నోచుకోం. పిల్లల పేర భీమా చేయిస్తే చాలు పెరిగాక పెద్ద చదువులు చదువుకుని..." ఆనంద భాష్పాలు క్రమ్ముకున్నాయి. మాట్లాడలేకపోయాడు.

ఝాము కొట్టారు. త్రాగిన కూలీల కలహాలు, తిట్లూ, బహిరంగంగా సిగ్గువిడిచి మగవాళ్లతో పోట్లాడే ఆడవారి అరుపులు వినిపిస్తున్నాయి. బురదగుంటల ప్రక్క పందులూ, కుక్కల అరుపులు స్పష్టంగా వినిపిస్తున్నది.

నిట్టూర్చాడు. "చూశావా జానకీ! ఇదీ మన బ్రతుకు. ఇవీ మన పరిసరాలు. వీటిలోంచి విముక్తి పొంది మనస్సుకు శాంతి దొరికే చోట జీవించాలని వుంది కదూ?"

జానకి మాట్లాడలేదు. మనసునిండా ఆలోచనలు. ఓవేపు ఇరవై వేల రూపాయలు మెరుస్తున్నాయి. తనూ ఆయనా, పిల్లలూ వాటితో చేసిన వంతెన మీదుగా ఎటో నడిచి

> "నాకు తెలుసు జానకీ! నువ్వొప్పుకోవని. కాని మనవేపూ, మన పిల్లల వేపూ వొక్కసారి చూడు. మన కడుపున పుట్టి ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నారో! వొక్కనాడైనా కడుపునిండా కూడు పెట్టగలిగామా? అలాగని రెక్కలు దాచుకున్నామా? అదీ లేదు. పగలనకా రేయనకా గొడ్డులా పనిచేస్తున్నాం."

వెళుతున్నారు. మరోవేపు..భయం... దొంగతనం.. ఆయన దొంగ.. తను దొంగ భార్య, పిల్లలు దొంగ కుమారులు. ఆలోచించలేకపోయింది. గుడిసె మీద తీతువు భయంకరంగా కూసింది.

రెండో ఝాము సమీపించింది. అతను లేచి బట్టలు వేసుకున్నాడు. జానకిలో చలనం, ఆలోచనా శక్తి నశించిపోయింది. భర్త చేస్తున్న ప్రతి పనీ గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయింది.

"తలుపువేసుకో జానకీ! వస్తా" అంటూ కనుమరుగయ్యాడు. ఇపుడు మూడో ఝాము.

దూరాన గుడ్లగూబ కళ్లు మెరుస్తూ కనిపించాయి. గుడిసె వెనక కుంటి కుక్క 'బాలూ' ఏడుపు వినబడుతోంది.

కొంపతీసి ఆయనకేం కాలేదుకదా! మనసు కీడును శంకిస్తోంది. మనఃఫలం మీద పోలీసులు మెదిలారు. ఎవర్నో సంకెళ్ళు వేసి తీసుకెళుతున్నారు. ఎవరో? వీపు మాత్రం కనిపిస్తున్నది.

న్యాయస్థానం కనిపించింది. ధర్మదేవత తనవేపే చిరునవ్వు నవ్వుతూ చూస్తోంది. కాని ఆమె చేతులకే ఎవరో బేడీలు వేసారు. కళ్ళకు గంతలు కట్టారు.

భర్త ఇంకా రాలేదు.

భర్త చేస్తున్న పని అధర్మం అని అంతరాత్మ ఘూర్ణిల్లుతున్నది.

దీపాన్నే నిశ్చలంగా చూస్తూ వుండిపోయింది. ఆలోచనావధులు దాటి మనస్సు కలతతో మొద్దుబారిపోయింది.

అలానే ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

ప్రక్కగుడిసెలో పిన్ని వచ్చి లేపేసరికి మళ్ళీ తెలివికి వచ్చింది జానకి.

"జానకీ! ఇలా పడుకున్నావేం? గోపాలం గురించేనా ఎదురుచూడ్డం. వీడికీ తాగుడు అలవాటయిందన్నమాట. వాడలోకెల్లా వీడే బుద్ధిమంతుడనుకున్నాను. త్వరగా లేమ్మా మిల్లుకెప్పుడు వస్తావు?"

జానకికి మత్తు ఇంకా వీడలేదు. బద్ధకంగా ఆవులించింది. "నోట్ల అచ్చాఫీసులో చోరీ జరిగిందటమ్మా! గూర్ఖాను చూసి దొంగోడు పారిపోతుంటే గూర్ఖా కాల్చాడట. దొంగాడు క్రిందపడి నడవలేక తనవద్దున్న ఆసిడ్‌తో మొఖం ఆనవాలు తెలీకుండా చేసుకుని చచ్చాడట. రాత్రి షిఫ్టుకెళ్లిన రంగయ్యన్న చెప్పాడు. యెక్కడైనా విన్నావమ్మా విడ్డూరం?" అంటూ ముక్కున వ్రేలిడుకుంది.

జానికికి నిద్రమత్తు దిగిపోయింది.

ఓ దీపం పురుగు వచ్చి కొడిగట్టిన దీపంపై వ్రాలడం, దాని రెక్కలు కాలటం దీపం ఆరటం, ఒక్క లిప్తకాలంలో జరిగిపోయింది. ఇల్లంతా చీకటి.

నిస్సహాయంగా తూర్పువేపు చూసింది జానకి. ఎర్రని మబ్బులు ఆమెను చూసి పరిహసించాయి.



– కూర చిదంబరం
సెల్:8639338675

1990లో రాసిన కథ


## హైకూలు

మావిచిగుళ్ళు
కొరుకుతూ కోకిల
కూని రాగాలు.

ఆకాశానికి
అందాల ముఖద్వారం
ఇంద్ర ధనుస్సు.

కంటి వెలుగే
కోనసీమ అందాలు
చూడ తరమా!

పూర్ణ చంద్రుడు
కొండ శిఖరాగ్రాన
పుట్ట గొడుగు!



– బొబ్బిలి జోసెఫ్
9989261991

## ఏదీ కరుణ?

మేలు కొలిపే
మాకు పందేలు పెట్టి
వినోదిస్తారా?
కోడిపుంజు ఆక్రందన!

–శంకర నారాయణరావు
సెల్:9959163676

## సూక్తాష్టకం

రెక్కాడితేగాని డొక్కాడదు
కడుపునిండదు నిదురపట్టదు.

గాలాడితేగాని శ్వాసందదు
గుండెకొట్టుకోదు ప్రాణనిలువదు.

అనుభవిస్తేగాని అవగతంకాదు
విశ్వాసంకలగదు ఆనందందొరకదు.

కళ్ళతోచూస్తేగాని నిజాలుతెలియవు
నమ్మబుద్ధిపుట్టదు రంగుబయటపడదు.

సాధనచేస్తేగాని పనులుసమకూరవు
ఫలితాలుచిక్కవు ప్రతిభవెల్లడికాదు.

మనసువిప్పితేగాని నిజాలుతెలియవు
అంతరంగంవెలువడదు
విలువబహిర్గతంకాదు.

అడుగులేస్తేగాని ముందుకుజరగము
పయనంసాగదు గమ్యముచేరము.

కలంకదిలితేగాని కాగితంమాట్లాడదు
కవితాపుష్పంపూయదు
భావరాగంవెలుగొందదు.



–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## ఆపదలో ఆదరణ

(కథ)



నరహరిపురంలోని ధర్మయ్యకు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అంటే చాలా ఇష్టం. అతని కొడుకు రాముకు అది ఇష్టం ఉండేది కాదు.

ఒకసారి ఆ గ్రామంలోని వాగు పొంగి వరదలు వచ్చాయి. ఆ వరదలకు శరభయ్య అనే వ్యక్తి నివాసానికి మిక్కిలి నష్టం వాటిల్లింది. ఆయన ఆ వరదలకు భయపడి తమ నివాసాన్ని వదిలి తన కుటుంబంతో సహా తన బంధువైన ఈ ధర్మయ్య నివాసానికి వచ్చాడు. ఆ ధర్మయ్య ఎంతో ప్రేమతో వారికి స్వాగతం పలికాడు. వారందరినీ ఆయన తన అతిథులుగా భావించి భోజనం, వసతి ఏర్పాటు చేశాడు. ఇది చూసి ధర్మయ్య మిత్రులు కూడా వారికి పాలు, పండ్లు తెచ్చి యిచ్చి ఎంతో ఆప్యాయత కనబరచి వారికి ధైర్యం చెప్పారు.

ఇదంతా గమనించిన ధర్మయ్య కొడుకు రాము మాత్రం తమ ఇంటికి వచ్చిన వారిపై , వారి పిల్లలపై కోపంతో రుస రుసలాడుతూ వారితో మాట్లాడకుండా మూతి ముడుచుకొని ఉండేవాడు. ఇది తల్లి గమనించి తన కొడుకును రహస్యంగా పిలిచి "బాబూ! నీవు అలా మన ఇంటికి వచ్చిన వారితో ముభావంగా ఉండవద్దు. వారు మనకు అతిథులే కాకుండా దూరపు బంధువులు. మనం వారిని ఆదరిస్తే వారు మనను ఆదరిస్తారు. ఇటువంటి వారి పట్ల నీవు ప్రేమను, గౌరవాన్ని, దయను చూపాలి. అందువల్ల వారి పిల్లలను నీవు ఆదరించి వారి తోటి మంచిగా మాట్లాడి ఆడుకో !" అని అంది .

తల్లి మాట విన్న రాము" సరేనమ్మా!"అని మరుసటి రోజు నుండి తన ప్రవర్తన ను మార్చుకొని వారి పిల్లలతో ఆడుకొంటూ అతడు కూడా వారిని ఆదరించి వారితో ఎంతో ప్రేమగా ఉండసాగాడు. కొద్ది రోజుల తర్వాత వరదలు తగ్గి శరభయ్య ఇంటి పరిస్థితులు చక్కబడటంతో వారు ధర్మయ్య చేసిన సాయానికి కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయారు .

మరికొన్ని రోజులకు ఈ ధర్మయ్య నివాసం పెనుగాలికి, భారీ వర్షానికి పాక్షికంగా దెబ్బతింది. అదృష్ట వశాత్తు వారెవరూ గాయపడలేదు. వారు ఇల్లు కూలిందని బాధపడుతున్న సమయంలో అక్కడికి గతంలో తలదాచుకున్న శరభయ్యతో పాటు అతని కుటుంబ సభ్యులు,పిల్లలు వచ్చి "ధర్మయ్య మామా! మీరు మా ఇంటికి రండి. ఎన్ని రోజులైనా మీరు మా ఇంట్లో ఉండవచ్చు!" అని ప్రేమగా ఆహ్వానించారు. అది చూసిన రాముకు అప్పుడు తన తల్లి ఎందుకలా చెప్పిందో అర్థమైంది. సరేనన్న వారు కొన్ని రోజులు శరభయ్య ఇంట్లో గడిపి తమ నివాసం బాగు చేసుకున్న తర్వాత అక్కడి నుండి తిరిగి వచ్చారు.

అప్పుడు రాము "అమ్మా! ఆ పిల్లలు నన్ను, మిమ్మల్ని ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. అందుకే ఇంటికి వచ్చిన బాధితులను, అతిథులను ఆదరించమని పెద్దలు చెప్పారు. మన కష్టాల్లో వారు కూడా మనను ఆదుకున్నారు. ప్రేమ ఉన్నవారే మన ఇంటికి వస్తారని నాకు అర్థమైంది" అని అన్నాడు.రాములోని మార్పుకు తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు.




–సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

# ఆదిపరాశక్తి అంశ ఆవు

ఆర్ష ధర్మబద్ధమైన భారతీయ సనాతన సమాజంలో అమ్మ ఆవు వంటిది అంటారు. అందుకే గోమాత మాతతో సమానమైనది. అప్పుడు మాత–గోమాత అన్న భావన ఇప్పుడు శ్రీమాత గోమాత అన్న స్థాయికి పర్యవసించింది. నిజమే వేదోపనిషత్తుఉల, ధర్మశాస్త్రాలు, కావ్య పురాణాలు, ఇతిహాసాలు తరతరాలుగా, యుగ యుగాలుగా గోవు పరమాత్మ స్వరూపమని ఘోషిస్తున్నాయి. ముప్పది మూడు కోట్ల దేవతలు గోవులో కొలువై ఉంటారని నమ్మకం. ఇటువంటి నమ్మకాలకు ఇటువంటి గ్రంథాలే సాక్ష్యాధారాలు.

లక్ష్మణరేఖ గోపాలకృష్ణగా పేరుబడ్డ డా. నిట్టలగోపాలకృష్ణగారు 'గో సంరక్షణ' ఉద్యమాన్ని భుజానికెత్తుకుని ఒక కార్యకర్తగా పని చేయడం ఒక ఎత్తయితే, గో సంబంధిత సాహిత్యాన్ని ఒకవైపు సృజనాత్మక రచనలుగా, మరొకవైపు పరిశోధ నాత్మక వ్యాఖ్యాన గ్రంథాలుగా వెలువరించడం మరో ఎత్తు. జీవిత చరమాంకాన్ని గోసేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి. గోవు మీద అనేక ప్రక్రియలలో గ్రంథాలు రచించారు. వేదాలలో ఉన్న గోవు ప్రస్తావనను ఒక సంకలనంగా కూర్చి, గో విజ్ఞాన సర్వస్వాన్ని రూపొందించారు. నిజానికి అనితర సాధ్యమైన ఈ కృషికి 'గోమాత–అద్భుతశక్తి' అన్న ఈ ఉద్గ్రంథానికే ఒక విశ్వ విద్యాలయ స్థాయిలో 'డాక్టరేట్' ఇవ్వవచ్చు. నిరంతరం భుజాన శ్రీమాతే గోమాత అన్న ఒక దండం ధరించి తిరుగుతూ ఉంటే పరివ్రాజకాచార్యుని తలపిస్తారు.

వారు ఇప్పుడు మనకు అందిస్తున్న 'శ్రీమాతే–గోమాత' అన్న ఈ పుస్తకం అపూర్వమైనది. ఈ రచనను చేయడానికి ప్రేరణ కలిగించిన శృంగేరి పీఠాధిపత్యం వహించిన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర భారతి గారి ఉదంతాన్ని ఉటంకించారు. వారు శ్రీమాతను పూజించడానికి వెళుతున్న సందర్భంలో ఎదురైన సంఘటన డాక్టర్ గోపాలకృష్ణ గారిలో ఆలోచనలను రేకెత్తింపచేసింది. అక్కడ వారు శ్రీమాతను అంటే శారదాదేవిని ఆరాధించడానికి వెళుతున్నారు. శారదాదేవియే శ్రీమాత, శ్రీమాతే గోమాత. ఈ భావధార ఈ పుస్తక రచనకు దారి తీసింది. ఆవు అమ్మవారైనప్పుడు, ఆమె బహు రూపాలలో, బహు నామాలతో కనిపిస్తూ పిలువ బడుతోంది. అందులో ఒకటి రూపాలలో, బహు నామాలతో కనిపిస్తూ పిలువబడుతోంది. అందులో ఒకటి లలితాదేవి, లలితా సహస్రనామాలు. డాక్టర్ గోపాలకృష్ణగారు ఆ వెయ్యి నామాలలోంచి 108 నామాలు అంటే అష్టోత్తర శతనామాలను మాత్రమే తీసుకొన్నారు. ఈ నామాల ప్రస్తావన కలిగిన వేదాలు, పురాణాలు, నిఘంటువులు, సూక్తాలు, స్మృతులు, దేవీభాగవతం, ఆగమాలు, సంహిత మొదలైన శాస్త్ర పురాణాలు, వేదోపనిషత్తులు పరిశీలించారు. వాటిని ఒక్కోనామం పరంగా వ్యాఖ్యానిస్తూ,




ప్రతులకు:గోమాత సేవాట్రస్ట్
202. శివసాయి సదన్
శ్రీనివాసపురం, రోడ్ నెం.3,
రామాంతాపూర్‌హైదరాబాద్–13.
సెల్: 94930 53206

గోస్వామి డా॥నిట్టల గోపాలకృష్ణ రచన శ్రీమాతే గోమాత గ్రంథంకి ఆచార్య టీ. గౌరీశంకర్ రాసిన ముందు బాట..

గోవుతో సమన్వయపరిచారు. ఇది వీరి నిశిత పరిశీలనాదృష్టికి, గోమాత పట్ల వీరికున్న భక్తి తత్పరతకు పరాకాష్ఠ.

దీనికి పూర్వ రంగంలో గోపాల కృష్ణగారు శ్రీ చక్రం గురించి ప్రస్తావించారు. మానవ దేహంలోని షట్చక్రాలు– మణిపూరకం, స్వాధి ష్ఠానం, మూలాధారం, అనాహతం, విశుద్ధ, ఆజ్ఞాచక్రం గురించి వివరించారు. శ్రీ చక్రంలోని వివిధ చక్రాలు మానవ శరీరంతో అనుసంధానించబడిన వైనాన్ని వివరించడం ఆత్మ తత్త్వాన్ని, ఆత్మే పరమాత్మ అన్న అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆ తరువాత శ్రీమాతే గోమాత అని నిరూపించే ప్రయత్నం చేశారు.


శ్రీచక్రం ఆ ఆదిపరాశక్తి యొక్క స్థూల రూపమనీ, యంత్రాలలో కెల్లా శ్రీయంత్రం లేదా ఎంతో శక్తివంతమై నదని అంటారు. శ్రీచక్రం మధ్య బిందువులో పరాశక్తి కొలువై ఉంటుం దిట. శ్రీచక్రంలో అయిదు త్రికోణాలు ఊర్ధ్వముఖంగా ఉంటాయి. అధోముఖ త్రికోణాలు శక్తి స్వరూపమనీ, ఊర్ధ్వముఖ త్రికోణాలు శివస్వరూప మనీ చెబుతారు. ఇవన్నీ ఒక వలయా కారంలో ఉంటుంది. ఈ పద్యాలన్నీ ఒక వలయంలో ఉంటాయి. ఈ వలయానికి వెలుపల మూడు వృత్తాకారాలుంటాయి. దాని వెలుపల మూడు రేఖల్లు చతుర్భుజ రేఖలుంటాయి. దానికి నాలుగు వైపులా నాలుగు ద్వారాలు ఉంటాయి. ఇదంతా శ్రీ చక్ర స్వరూపంగా చెప్పబడింది. అంటే మొత్తమ మీద తొమ్మిది త్రిభుజాలు శ్రీ చక్రంలో ఉండటం వల్ల దీనిని నవయోని చక్రం అని కూడా అంటారు. ఈ శ్రీచక్రం నిత్య దేవతలు, యోగినీ దేవతలు వంటి దేవతాగణ సమూహాలచే పరివేష్ఠింపబడి, అందులో ఆదిపరాశక్తి అయిన శ్రీమద్రాజ రాజేశ్వరి దేవి మధ్య త్రికోణంలో అధివసించి ఉంటుంది.ఆదిపరాశక్తి అయిన ఆ శ్రీమాతే ఈ గోమాత అన్నదానిని ప్రతిపాదించ డమే ధ్యేయంగా డాక్టర్ నిట్టల గోపాలకృష్ణగారు చేసిన ప్రయత్న ఫలితమే ఈ 'శ్రీమాతే– గోమాత' అన్న గ్రంథ రాజము. నిరంతరం గోమాత చింతనాపులైన డాక్టర్ నిట్టల గోపా లకృష్ణ గారిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రశంసాపాత్రమైన నా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

–ఆచార్య టీ. గౌరీశంకర్
సెల్: 94409 69130

# కొండ బండల మాటున విప్పారిన అడవి పుష్పం 'మేకల బండ'

ప్రతిరోజుకూ ఒక సూర్యోద యం ఉంటుంది. ప్రతి రోజూ సూర్యాస్త మయంతో ముగుస్తుంది. భౌగోళిక, నైసర్గిక స్వరూపాల్లో ఒక్కో చోట ఒక్కో జీవన జీవిత సంఘర్షణ ఉంటుంది. మనిషికి జీవన మనుగడ తప్పనిసరి. దీన్నే **'మను గడ కోసం పోరాటం'** అని చరిత్ర చెప్తుంది. ఆహారపు గొలు సు చక్రంలో బందీగా చిక్కుకున్న మనిషి పాతరాతియుగం నుంచి నేటి నవీన నాగరికతల వరకు మనిషి ప్రస్థానం ఒక సుదీర్ఘ సంఘర్షణ. మనిషి దొక నిరంతర సమరం. ఈ భూమ్మీద ప్రతి చోటా ఇట్లాంటి 'ఘర్షణ' కొనసాగు తూనే ఉంది. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ, అంటు రోగాలను దాటుకుంటూ, సవాళ్ళు, సంక్షోభాలను అధిగమిస్తూ మానవ ప్రస్థానం కొనసాగుతోంది. ఈ పరిణామక్రమాన్ని అక్షరీకరించడం సాహిత్యకారుడి బాధ్యత. సముద్రాలూ, పర్వతాలూ, కొండ లూ, పుట్టలు, నదులు, వాగులూ, వంకలూ.. అన్ని టినీ దాటుకుంటూ వెళ్తే ఈ ప్రయాణంలో ప్రతి చోటా మనకూ ఒక జీవన జీవిత సంఘర్షణ కనిపిస్తుంది.

గ్రామీణ జీవితంలో వస్తున్న మార్పులను గురించి, మారిపోతున్న మానవ సంబంధాల గురించి ఇటీవల కాలంలో రచనలు చేసే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థి తుల్లో ఆత్మీయులు శ్రీ ఆర్.సి.కృష్ణ స్వామి రాజుగారి **'మేకల బండ'** నవల చదవడం సంతోషాన్నిస్తుంది.




ప్రతులకు:
ఆర్.సి.కృష్ణస్వామిరాజు
22-4-71, బ్యాంకు
ఎంప్లాయి కాలనీ,
మంగళం రోడ్,
తిరుపతి–517 597
సెల్: 9393662821

రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు ప్రాంతం మాండలిక యాసకు ఒక గుర్తింపు ఉంది. పల్లె జీవితం ఎలా ఉంటుందో, అక్కడి బతుకు తెరువు, రోజులు గడవడం కోసం ఉపాధి అవకాశా లు లేనిచోట... జీవితమే పోరాటం అవుతున్న చోట.. ఎలా ఉంటుంది జీవనం? ఏమి చేస్తె నాలుగు రూకలు జేబులోకి వస్తాయి? ఐదు వేళ్ళు నోటి దగ్గరికి చేర్చడానికి కుటుంబం అంతా ఏమి పనులు చేయాలి? జీవి తం విసిరే సవాల్ ఎలా ఉంటుంది. చిత్తూరు జిల్లా పుత్తూరు ఈశ్వరా పురం గ్రామం. దానికి పడమటి

ఆర్.సి.కృష్ణస్వామిరాజు రచన 'మేకల బండ' నవలకు డా॥ వేంపల్లి గంగాధర్ రాసిన ముందు మాట...

దిక్కున పెద్ద గుట్ట. దాన్ని 'గోవింద పాదం' అని పిలుస్తారు. దాని చుట్టూ ఏం కథ నడిచింది? బతుకు చిత్రం ఎలా ఉంది? కష్టాలు, కన్నీళ్ళూ, కల్లో లాలు ఈ నవల్లో చెప్తారు కృష్ణ స్వామి రాజుగారు.

'మేకలబండ' పేరు వినగానే గ్రామీణ ప్రాంతంలోని మట్టి పరిమళం మనల్ని తాకుతుంది. ఉదయాన్నే వాన కురిసి ఆగిన తర్వాత వచ్చే మట్టి వాసన నిండిన నవల ఇది. సజీవ పాత్రల చుట్టూ అల్లిన అక్షర శిల్పం. వాస్తవ దృశ్య రూపం. కొండకు వెళ్ళే దారిలో కొండ బండల మాటున విప్పారి న అడవి పుష్పం. ఈ దారిలో ఎన్నో పాత్రలు మిమ్మల్ని ఆత్మీయు ంగా హృదయానికి హత్తుకుం టాయి.

**అతడు సుందరం కావచ్చు.**
**అతడు పెంచల్ రాజు కావచ్చు.**
**అతడు తిరుపాలు కావచ్చు.**
**అతడు వడివేలు కావచ్చు.**

చివరికి ఎగురుతూ ఎగురు తూ పోతున్న 'నల్ల గొర్రె' కూడా కావచ్చు. మేకల బండకు దక్షిణాన ఉన్న చిన్నగుట్ట దగ్గరి చింత చెట్టు కొమ్మ ల్లోని పక్షి గూడు కావచ్చు.

అక్కడ రాత్రి వినిపించే పాట కూడా కావచ్చు.

ఏనుగు అరుపు కావచ్చు.

అంతే కాదు.. ట్రెక్కింగ్ చేసే రమణ, బాలు కూడా పలకరిస్తారు. 'క్యాంప్ ఫైర్' నీలోనూ రగులుకుంటుంది!

మేకలబండ నవల్లో రచయిత అనుభవ పరిధి స్పష్టమౌతుంది. అతడు బలమైన ఇతివృత్తం ఎంపిక చేసుకున్నాడు. ఒక్కో సాహిత్యకారుడిది ఒక్కో శైలి, ఒక్కో శిల్పం, ఇదంతా కృష్ణస్వామి రాజుగారి స్వభాష. వారు ఎంపిక చేసుకునే పాత్రలే ఈ నవలను నడిపించాయి. సన్నివేశాలు రూపుదిద్దుకున్నాయి.

'మేకలబండ'ను సాహితీ లోకానికి పరిచయం చేసిన శ్రీ ఆర్.సి.కృష్ణ స్వామి రాజుగారికి హృదయపూర్వక ఆత్మీయ అభినందనలు. ఈ దారి వెంట మీరూ రండి! నల్లగొర్రె, కుంటి మేక, తెల్ల పొట్టేలు, మేకపోతు వస్తుంటే విన్పించే వాటి మెడలోని గంటల శబ్దం మీరూ వినవచ్చు.

– డాక్టర్ వేంపల్లి గంగాధర్
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1719వ రోజు 'నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

## కీసరగుట్ట

చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రం
శివకేశవుల దర్శనంతో పునీతం
శ్రీరాముడు
ప్రతిష్ఠించిన రామలింగేశ్వరుడు
స్వయంభూలింగంగా ప్రసిద్ధం.
పచ్చని ప్రకృతి నడుమ
గుట్టపై వెలిసిన క్షేత్రం కేసరిగిరి
హనుమ భక్తికి తరగని సిరి
రాముని ఆదేశంపై
రివ్వున ఎగిరిన హనుమ
కాశీనుండి నూటొక్కలింగాలతో
రివ్వు రివ్వున వాలిన గిరి.
సాయం సంధ్యా పూజకై
రాముని అనుగ్రహించె పరమశివుడు
స్వయంభూలింగంగా అవతరించే
వాయువేగాన వాలిన హనుమ
బాధ కోపం ఆక్రోశంతో తాదెచ్చిన
లింగాలను
తోకతో విసిరే
గుట్టపై లింగాలన్నీ శివమయమై
అంతటా కానవచ్చు
భక్తుల పూజ లందు.
క్షేత్ర పాలకునిగా హనుమ
నాగదేవత, నర్సింహస్వామి
ఎదురుగా నందితో
హరహరశంభో అంటూ
కార్తీక మహాశివరాత్రి
రోజుల్లో కిటకిట
నందీశ్వరుని చుట్టూ
ఆశల కోరికల
ముడుపుల మూటలు.
దూరంలో ప్రశాంత వాతావరణంలో
రామకృష్ణ మఠం
గురుకుల విద్యాలయం
వారాంతంలో విహారయాత్ర గా
సరదాగా సందడితో జనం
ప్రకృతిమాత ఒడిలో
ఉక్కిరిబిక్కిరి
నగరకాలుష్యానికి దూరంగా
భక్తి రక్తికి కేంద్రం
కీసర సర్వం శివకేశవ మయం.

-ఎ.రాజ్యశ్రీ

## కాశ్మీర్ అందాలు

ప్రకృతితో సహవాసం
పరవశించు నా డెందం.
హిమనగపు సానువులు
ఇంపైన పూదోటలు
జలసిరుల సెలయేరులు
కమనీయపు సొగసులు
//ప్రకృతి//.
మంచుపూల దుప్పట్లు
పరచుకున్న పచ్చికలు
పల్లవించు హిమ నదాలు
పడమటి సంధ్యారాగాలు
పరవశించు గుండె లయలు
//ప్రకృతి//.
ప్రేమ మూర్తుల పహల్గావ్ లు
పేరున్న మొగల్ ఉద్యానవనాలు
గుల్ మార్గుల అందాలు
గుంభనమై దోచు మదులు
//ప్రకృతి//.
ఎత్తయిన సరస్సులు
ఎనలేని అందాలు
జనరంజక నృత్యాలు
జానపదుల జావళీలు
//ప్రకృతి//.
నింగినంటె నీలిసరస్సులు
కలల ప్రపంచపు కళాఖండాలు
భారతమ్మ శిఖ మాలలు
భవ్య కాశ్మీరపు అందాలు
//ప్రకృతి//.

-నగునూరి రాజన్న

## అందాల కాశ్మీరం!

అందాలొలికించు కాశ్మీరం
పచ్చని ప్రకృతి కన్నియ
పరువపు శోభలతో
కళకళలాడుతూ
హిమవన్నపు సోయగం.
గిరులు..
నింగిని ముద్దిడుతూ
మంచు పూల దుప్పట్లను కప్పుకొన్న
ముగ్ధ మనోహర జలపాతాల
ఝురులుప్పొంగగా గలగలపారే
సింధు, గంగానదీ లోయల లయలతో.
నీలాల నింగి హరివిల్లుల వర్ణాలతో
రంగుల హంగులు మారుస్తూ
మంచు పూల నెత్తావితో పరిమళాలు
పుడమి పొత్తిళ్లలో ప్రేమను పంచుతూ..
పహల్గావ్ అందాలతో
గుల్ మార్గ్ లోని వన బృందావన
పూదోటల రంగోలీ హేలలు
నీలాల రంగుల అలలతో
సయ్యాటలు
డాల్ సరస్సులో బోటింగ్
హౌస్ సుందర దృశ్యాలు
చలి చలిగా విహారాలు.
సరిహద్దుల రక్షణలో
దీటుగా
భారతమ్మ సిగలో
ఆభరణాలు
నడుముకి వడ్డాణాలు
సెలయేరుల ఝురులు
జిగిబిగి ఊహల కౌగిలిలో
కలల స్వర్గమని
మురిపించే అందాలతో
హృదిని పరవశింపజేసే
అద్భుత లోకం
మన కాశ్మీరం భవ్యం
సురలనే భువికి రప్పించిన
మానస మందిరం.

-పి.పద్మావతి

## పోర్ట్ బ్లయర్

అల్లంత దూరాన సాగర ఆవల
అండమాన్ ద్వీపాల రాజధానిగా
విరిసిన చారిత్రక ద్వీపరాజము
పోర్ట్ బ్లయర్ నచ్చి మెచ్చే
పర్యాటక ప్రదేశం.
చుట్టూరా సముద్రం
మధ్యలో ఎత్తుపల్లాల కొండ ప్రదేశం
ముఖ్య భూమి నుండి ద్వీపానికి
రెండున్నర రోజుల ఓడ ప్రయాణం
రెండుగంటల విమానయానం
విచిత్ర సాంఘిక అనుభవం.
అండమాన్ నికోబార్ ద్వీపవాసుల
పలుచోట్ల
ప్రాంత, మత, భాషల
సామరస్య సహజీవన మిశ్రమం
కారణం కాలాపానీ పేరుతో
స్వాతంత్ర్య యోధులను ఖైదీలుగా
సెల్యులర్ జైలు శిక్షలకు
గురిచేసినప్పుడు
అందరూ భారతీయులమనే
గాఢ బంధనాల బంధువులు
అవ్వటం మాత్రమే.
సెల్యూలర్ జైలు దర్శనం
ఆనాటి స్వాతంత్ర్య యోధుల శిక్షలు
కలిగిస్తాయి గగుర్పాట్లు
కలిగిస్తుంది
వారి పట్ల ఆరాధనాభావం
మౌంట్ హేరియట్ దీపంలో
ఎత్తైన పర్వతం
ద్వీప సౌందర్యాలను
పక్షిదృశ్యాలను
ఆనందించేందుకు వీలైన స్థలం.
రంగు రంగుల సముద్ర
అంతర్గత క్వారల్సు అందాల
వీక్షణకు
వివిధ మత్స్య లోకాల విహరించే
వీలైన డైవర్ ఘాటుల
ప్రత్యేక జలాంతర్గత యాత్రలు.
దిలానిపూర్ మార్కెట్టే
ఈ నగరానికి కేంద్రీకృత బజారు
గవ్వలు, శంఖాలు, గుల్లలు
పలురకాల ఆకర్షిత అలంకార
నగలు.
కార్బన్సు కోవ్ బీచ్ విరామానికి
ఈతగాళ్లకు సాహస ఆటలకు తగు
ప్రదేశం
వండూరు బీచ్
మరింత ప్రకృతి
సాగర సౌందర్యాలకు నిలయం.
షాంపేనులు జారువాలు ఓంగీలనే
ప్రాంతీయ అటవిక జాతులను
సంరక్షిస్తూ
వారి జీవన శైలిని చూపి
విశేష జీవన పద్ధతిని చూపే
మ్యూజియాలు
రబ్బరు, పోకచెక్క
లవంగాలు,
ఏలకుల తోటలను
చూడదగ్గ వ్యవసాయ
పరిశోధన సంస్థ.
హిందూ మందిరాలు
సిక్కు గురుద్వారాలు
చర్చిలూ మసీదులూ
సర్వ మత సౌభ్రాతృత్వానికి
నిదర్శనాలు
ఏ పండుగైనా
మతసామరస్యంతో
అన్యమతస్థులు కూడా
హుషారుగా పాల్గొనే ప్రదేశం.
హిందీ వాడుక భాష
ఆపై పంజాబీ, బెంగాలీ
తెలుగు, తమిళ
మళయాళ భాషలూ
వినవచ్చు.
పోర్ట్ బ్లయర్
ఒక భూతల స్వర్గం.

-రాజప్ప

## మాయమౌతోన్న మనోహర దృశ్యాలు

చేతికందేటట్టనిపించే
హిమగిరులు
చెంపను నిమిరే
తుషార పవనాలు!
క్షణంలో చిరుజల్లు
మరుక్షణంలో ఎండ జిల్లు!.
పచ్చని పచ్చిక తివాచీలు
తెల్లని
పాలనురుగు పొగమేఘాలు
కంటికానని
మహోన్నత గిరులు
కళ్ళు తిరిగేలా
లోతైన లోయలు!.
ఎంత నడిచినా
రాదు అలసట
అదే మసూరీ లో కనిపించే
హిమశిఖరాల
మాయాజాలమట!.
నాటి మలయమారుత
సరిగమల స్థానంలో
ఉష్ణంతో
ఉడుకెత్తించే వేడిగాలులు
చిటపట చినుకుల
ఊసే లేదు
ఉక్కపోతతో
పులకరింపుల స్థానంలో
స్వేద చీదరింపులు!.
పాలనురుగు పొగమేఘాలు
తరలి వెళ్లిపోతున్నాయి
చెంపను నిమిరే
తుషార పవనాలు
తుడిచి పెట్టుకు పోతున్నాయి
హిమగిరులు కనబడకుండా
ఎత్తైన భవనాల అంతస్థులు
అడ్డుకుంటున్నాయి!
ఎటు చూసినా
పాలిథిన్ కవర్ల గుట్టలు
అపరిశుభ్రమైన పరిసరాలు
జనసందోహంతో,
డీజేల గోలతో
విపరీతమైన శబ్దకాలుష్యం!.
పర్యావరణ
విఘాతాన్ని తట్టుకోలేక
జారుకుంటున్న
జలతారు మబ్బులు
మాయమౌతోన్న
మనోహర దృశ్యాలు!.

- చంద్రకళ దీకొండ

## విజయనగర సామ్రాజ్య దర్పణం

మనస్సుపై
చెదరని ముద్ర వేస్తుంది
విజయనగర సామ్రాజ్య
వైభవ దర్పణమైన హంపీ నగరంలా
కర్ణాటక రాష్ట్రంలో
తుంగభద్ర నది ఒడ్డున
బళ్ళారి జిల్లా ప్రాచీన హంపీ నగరం
మానవాళికి దక్కిన వారసత్వంగా
యునెస్కో ప్రకటించిన పట్టణం
అలనాటి జయాల పట్టణం
విజయనగర సామ్రాజ్య
రాజధానీ నగరం.
రామాయణకాలంలో సమీప
ఆనెగొంది పట్టణంలో
ఆంజనేయుడు జన్మించిన
అంజనాద్రి పర్వత స్థానం
రామసుగ్రీవులు కలుసుకున్న
కిష్కింధారణ్య ప్రాంతం
పదునాలుగు, పదునారవ
శతాబ్దాల నాటివి
చక్రవర్తులూ శిల్పుల
కళాభిరుచికీ నైపుణ్యానికీ
నిదర్శనాలుగా నిలిచిన
అద్భుత రాతి కట్టడాల
బహిరంగ వస్తుప్రదర్శనశాల
పర్యాటకుల క్రమశిక్షణకు
రసజ్ఞతకు తార్కాణం.
లలితకళల్లో
కదనరంగంలో
సాటిలేని మేటి
విజయనగర సామ్రాజ్య వైభవాన్ని
శిధిలాలయాలు, కళాఖండాలతో
వేనోళ్ళ చాటుతున్న
ప్రాచీన హంపీ పట్టణం
నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం
మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే ఊరు.
నాడు ఇక్కడే కూర్చున్నాడేమో
దక్షిణ భారత దేశాన్ని
ఏకఛత్రాధిపత్యంగా ఏలిన
శ్రీ కృష్ణదేవరాయలు!
తెలుగు సాహిత్య చరిత్రలో
స్వయంగా మొట్టమొదటి
స్వతంత్ర ప్రబంధాన్ని రచించిన
ఆ ఆంధ్రభోజుడు అష్టదిగ్గజకవులతో
ఈ రాతి వేదికపైనే ఆసీనులైనారేమో
!.
ప్రబంధకవితాపితామహుడు
అల్లసాని పెద్దన నడయాడిన నేల
ఇదేనేమో పదగుంఫన కవి
రామలింగడు సంచరించిన వీధి
సంగీత కళా వచోనిధి
రామరాజభూషణుడు
తన పద్యాలను పాడుకుంటూ
తిరుగాడిన ప్రాంతం
ఇక్కడేనేమో
రత్నాల రాశులు అమ్మబడ్డాయి!
అలనాటి సకల రంగ సమృద్ధి
కళ్ళెదుట కనబడి
ఒళ్ళు పులకరిస్తుంది.
నేటికీ నిత్యపూజలందుకుంటున్న
విరూపాక్ష దేవాలయం
పెద్ద ఏకశిలారథం
హృదయవీణను మీటే
విఠలాలయ సప్తస్వర స్తంభాలు
ఉగ్ర నరసింహుని శిల్పం
నాటి రాణుల వేసవివిడిది
లోటస్ మహల్ ' -
ఒకప్పటి నవరసభరిత
జీవనశైలీ దర్పణం
హంపీ నగరం
మెదడు పొరల్లో నిక్షిప్తమైన
కళల భాండాగారం.

-ముద్దు వెంకటలక్ష్మి

# భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం.. భర్త ఆత్మహత్య

కరీంనగర్, మార్చి 4: పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన చెప్పాల దేవేందర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి మంథని ప్రధాన రహదారిలో గల గుండారం గ్రామ శివారులోని పత్తి చేసులో ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ, సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

సింగరేణి సంస్థ ఆర్జీ- 3 పరిధిలోని సెంటినరిరాలనీ నర్స రీలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి దేవేందర్ పేరపల్లిలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై గాలింపు చర్యలు చేపట్టారు.

ఈ క్రమంలోనే గుండారం శివారులోని ఓ పత్తి చేసులో దేవేందర్ మృతదేహం కనివించింది. దేవేందర్ గత 15 ఏళ్ల క్రితం పేరపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరి అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు ఆశీష్, కుమార్తె కీర్తన ఉన్నారు. భార్య, భర్త మధ్య రెండేళ్లుగా విభేదాలు జరుగుతున్నాయి .

ఏడాదిగా ఇద్దరి పిల్లలతో కలిసి తన తల్లిగారింటికి మల్లేశ్వరి వెళ్లిపోయింది. అప్పటి నుండి దేవేందర్ మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసై మంగళవారం ఈ అఘాత్యానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఫిబ్రవరి 21న పొట్లూరి ఫౌండేషన్ విజయవాడ తుమ్మలపల్లి కలాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు కవుల మహాసభల్లో ఆం.ప్ర. తెలుగు -సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్, ఆం.ప్ర. సంగీత నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణల ద్వారా 'కళాశ్రీ' పురస్కారం అందుకుంటున్న సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు. చిత్రంలో పొట్లూరి హరికృష్ణ తదితరులు.



-డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు 2024 జనవరి నుంచి వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం నిర్వహించిన కథల వర్క్ షాపులో రెండు కథలను ఎంపిక చేయటం జరిగింది.

-సంపాదకులు

## కర్మఫలం

ఆ గ్రామం అంతా సందడి సందడిగా ఉంది. కోడి పందేలు వేసే వారితోను, చూసేవారితోను. కాజు, బాదం, పిస్తాతో పాటు చిరుధాన్యాలు మేసి బలిష్టంగా ఉన్న కోడిపుంజులను బరిలోకి దించారు కామేశం, మహేశంలు.

పోటీ మొదలైంది. రెండు పుంజుల మధ్య జన్మజన్మల శతృత్వం ఉన్నట్లు తగ్గేదేలే, అంటూ హోరాహోరీ పోరాటంతో జనులకు వినోదం కలిగిస్తున్నాయి.

చివరకు కామేశం పుంజు మరణించింది.

సోమేశం పుంజు కోటి రూపాయలు గెలిచిందన్న సంతోషం ఎక్కువసేపు నిలవకుండానే తీవ్రంగా గాయ పడటం వల్ల చికిత్స చేయించినా ఫలితం లేక సోమేశం పుంజు కూడా మరణించింది.

యమభటులు పుంజులు రెండింటిని నరకానికి తీసుకెళ్లారు. "యమధర్మ రాజా, మేమేం పాపం చేశాం?

మమ్మల్ని నరకంలో పడేసారు? వేకువనే జనులను మేల్కొలుపుతూ క్రిమి కీటకాలను తింటూ పరిసరాలను శుభ్రపరిచే మాకు కోడిపందేల పేరిట వైరం పెట్టి హింసించి కోట్లు గడించే నరులను కదా మీరు శిక్షించాలి! మేమేం పాపం చేశాము ?" అన్నాయి పుంజులు.

అప్పుడు చిత్రగుప్తుల వారు ఇలా చెప్పారు.

"గత జన్మలో మీరు ఇద్దరూ అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులుగా

ప్రజలకు ఉచితాల ఎరవేసి కోట్లు కూడబెట్టుకుంటూ అమాయక ప్రజలే సమిధలుగా మత విద్వేషాలు రగిల్చి

మీ అధికార దాహం తీర్చుకొనటానికి ప్రజలను బలిపశువుల కావిస్తూ, వినోదం చూస్తూ ఆడిన వికృత క్రీడల కర్మ ఫలితంగా కోడిపుంజులై జన్మించి కొట్టుకు చస్తూ ప్రజలకు వినోదం కలిగిస్తున్నా" రంటూ సెలవిచ్చాడు చిత్రగుప్తుడు.

"మరి ఇప్పుడు పాపం పరిహారం ఐపోయిందా చిత్రగుప్తా" అన్నాడు యమధర్మరాజు.

"అవలేదు ప్రభూ! ఇంకా పాపం అనకొండలా మిగిలే ఉంది." అన్నాడు చిత్రగుప్తుడు.

'ఐతే పాప పరిహారం అయ్యేదాకా కోడిపుంజులుగానే జన్మిస్తూ కొట్టుకు చస్తూ ప్రజలకు కోట్లు కురిపిస్తూ వినోదం కలిగించాలి. కర్మఫలితం అను భవించక తప్ప"దంటూ శెలవిచ్చాడు యమ ధర్మ రాజు.

-సంబరాజు రమణి

## బంధం

"బావా, ఈసారన్నా పండక్కి రావా ల్సిందే" అన్న బామ్మర్ది మాటలకన్నా ... పిల్లల గొడవలకి తట్టుకోలేక ఇక పల్లెటూరి ప్రయాణానికి సిద్ధం అయ్యాడు. "వస్తాను కానీ ఈ సారి కోడిపందాలకి నేనూ వస్తా, డేగ పుంజు సిద్ధంగా ఉందిగా" అంటూ నవ్వాడు.

"బావా, దాని చలువ వల్లే పోయిన ఏడాది ఇల్లు బాగు చేయించుకుని మీ చెల్లి కి బంగారం కూడా కొన్నా. ఈ సారి చూడు భావా , మన డేగ కొట్టిన దానిలో నీకే సగం" అంటూ ఫోన్ పెట్టేసాడు.

రమేష్ తల్లితండ్రులు ఒకేసారి యాత్రలో మరణించటం , ఆస్తుల పంపకంలో తమ్ముడు సురేష్ తో గొడవలు. ఇక పట్నమే సర్వస్వంగా ఉండి పోయాడు. పల్లెకు వస్తె తమ్ముడి ముఖం చూడాల్సి వస్తుంది. ఎదురు పడితే ఎక్కడ మాట్లాడాల్సి వస్తుందో అనే కోపం మరో పక్క కోడి పందాలతో డబ్బు బాగా సంపాదించిన తమ్ముడి మీద కసి ఎలాగైనా తమ్ముడి పుంజును ఓడించి తాను గెలుపొందాలనే కోరిక రమేష్ ను ఊరు వెళ్లేందుకు పురికొల్పింది.

ఇక ఆ సమయం రానే వచ్చింది. రమేష్ భామర్దితో కలిసి బరిలోకి పుంజును వదిలేందుకు సిద్ధం అయ్యారు, సురేష్ కు అన్నయ్య వూరిలో వచ్చిన సంగతి తెలిసీ తన పుంజు ను స్నేహితుడితో పంపి ముఖం చాటు వేశాడు.

గతం లో ఘన చరితలు సాధించిన పుంజులు రెండూ బరిలోకి దిగటంతో మొత్తం ఆ ప్రదేశమంతా ఈలలు చప్పట్లతో మారుమ్రోగిపోయింది. అందరూ ఉద్వేగపు చూపుల మధ్య పోరు ప్రారంభం అయ్యింది. అందరి ఆశల మీద నీరు చల్లినట్లుగా అవి పోరుకు దిగకుండా ఒకదాన్ని ఒకటి రాసుకుంటూ పోసుకుంటూ ము క్కులుతో పలుకరించుకుంటూ కాలం సాగదీ స్తున్నాయి.


రమేష్ కోపంతో "పెట్టమార్ పుంజును తెచ్చి నా పరువు తీశావు" అంటూ బామ్మర్ది మీద చిందు లేయటం మొదలు పెట్టాడు, "బావా, మన పుంజు సాధించిన మెడల్స్ కూడా ఉన్నాయి. నీవు నన్నూ, నా పుంజుని అవమానించుకు" అంటూ చిన్న బోయాడు.

ఆట నిరాశ అవ్వటంతో ఇరువర్గాలు వెనుకకు తిరిగాయి.

పుంజులు కొన్న పెద్దాయన దగ్గరకు వెళ్ళి విషయం చెప్పారు. "కుక్కుట శాస్త్రానికే విరుద్ధం. అలా జరగటానికి వీల్లే" దంటూ ఆ పుంజులను వేరు వేరు వాటితో పోరుకు దింపారు.



కన్నుమూసి తెరిచేలోగా అవతల [illegible] మట్టి కరిపించటంతో అందరూ వి[illegible] అయ్యారు. ఆ రెండూ పుంజులూ ఆ[illegible] తీసుకున్నారని, అవి ఒక తల్లి సంత[illegible] ఆయన గుర్తించారు. "పౌరుషానికి [illegible] తమ జాతి లక్షణాన్ని మరచి అవి బంధాన్ని కాపాడుకోవటానికి ప్రాధాన్యతని ఇచ్చాయి.,. మనుషులమైన మనం మాన వత్వాన్ని మరచి అమానుషంగా ప్రవర్తిస్తున్నాం. నోరులేని మూగ జీవాల ద్వారా మనం నేర్చుకో వాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి" అంటూ నిట్టూర్చాడు పెద్దాయన. అన్నదమ్ములిద్దరూ ఒకరి వైపు ఒకరు ప్రేమ గా చూసుకోవటంతో ఆ పుంజులు ఎగిరి యజ మానులపై వాలాయి.



-మేడిశెట్టి సుభద్రా కృష్ణ





ఫిబ్రవరి 20వ కమలాకర్ మెమోరియల్ ఛారిటబుట్ ట్రస్ట్ హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారకరామారావు కళామందిరంలో నిర్వహించిన ట్రస్ట్ 35వ వార్షికోత్సవ సభలో తెలంగాణ రాష్ట్ర పూర్వ బి.సి.కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ద్వారా సాహత్య సేవా పురస్కారాన్ని అందుకుంటున్న సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు. చిత్రంలో స్వాతి శ్రీపాద, ఆచార్య అనంతలక్ష్మి, డా॥జయరాములు, ఆచార్య ఫణీంద్ర, పెద్దూరి వెంకటదాసు, ట్రస్ట్ ఛైర్మన్ కమలాకర భారతి తదితరులు.




## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



## లక్ష్యాన్ని సాధించుకో

లక్ష్య సాధన చేసుకో
లక్ష్యాన్ని సాధించుకో
పరీక్షలను ఎదుర్కో
విజయాన్ని సాధించుకో
నిరాశను దూరం చేసుకో
ఉత్సాహాన్ని పెంచుకో
అందరిని కలగలుపుకో
మిత్ర భావాన్ని పాటించుకో
దుఃఖాలను నియంత్రించుకో
మనోబలాన్ని పెంచుకో
వృద్ధుల సలహాలు తీసుకో
సమస్యలను పరిష్కరించుకో
శాస్త్రాలను అధ్యయనం చేసుకో
విజ్ఞానం ,వివేకం పెంచుకో
మంచి చెడుల భేదం తెలుసుకో
నీ చరిత్రను తిరగరాసుకో
ఆత్మ విశ్వాసాన్ని తోడు చేసుకో
విజయం వైపు పయనం చేసుకో.

-శ్రీనివాస్ నూతలపాటి
విజయవాడ

## పట్టుకున్న ప్రణాళిక - విజయం

విజయమంటే ఇంకొకర్ని దాటెయ్యటం కాదు
కసితో కబలించి పెత్తనం పట్టి పోరు కానేరదు
నైపుణ్య పరిణతి మెచ్చి మదిలో పొగడటం
పాటవ పరిమితి పోటీలో సందేశమివ్వటం
శత్రవైనా మన ప్రజ్ఞను పాటించి తలవటం.
ఓటమిలో లోపాలను నేర్చి సరిదిద్దు పాఠం
గెలుపంటే గర్వం అణిచి కొంగ్రొత్త అన్వేషణ
సమయం సంయమనం నేర్చుకు సన్మానం
పోటీదారుని అలక్ష్యమే గెలుపానెడి మైత్రి
వైరి వీరాన్ని గౌరవిస్తూ మన శక్తిని పెంచు దీక్ష.
ఆయాచిత గెలుపు గెలుపే కాదు వయసట్టిది
పోరు తీవ్రతన చిత్తం చలించని స్థైర్యతే జయ
చివరంటు తగ్గని పోరాట పఠిమే గద్దె ఆశీనం
తడబడని తొలి అడుగు అర్ధ గెల్వ సంకేతం
దర్పం సొష్టవం వల్లొచ్చిన కీర్తి శాశ్వతం కాదు.
ఆటపై పట్టు కూర్పులో దక్షత సాధనలే
నీతి నియమపాలన తప్పని ఏకాగ్రతలు
విజయ సోనానాలకు అదృష్ట కలిమి చెలిమి
గెలుపు మౌనాన్ని మన్నన పాటిస్తేనే గౌరవం
ప్రణాళిక కఠోర శ్రమ పట్టు విజయ సోపానాలే.

-గజ్జెల శ్రీనివాసులు
9573364928

## ఎగుర వేయాలి కీర్తి పతాకం

కృషి పట్టుదల ఉంటే
సాధ్యం కానిదేదీ ఉండదు
కార్యదీక్ష, ఆత్మవిశ్వాసం తోడుంటే
ఓటములను వెనక్కు నెట్టి
గెలుపుబాటకు దారులు
సుగమనం చేసుకోవచ్చు.
పరీక్షలను ఓ సవాలుగా
స్వీకరించాలి
ఆత్మస్థైర్యం ప్రోది చేసుకుని
అడుగుముందుకేయాలి .
విద్యార్థుల్లారా పరీక్షలంటే.
ఒత్తిడెందుకు
ఏకాగ్రతతో చిత్తమును
పరీక్షలపై లగ్నం చేసుకుంటే
విజయసోపానాన్ని
అధిరోహించవచ్చు
ఎక్కలేని కీర్తి శిఖరాలపై
విజయ పతాకాన్ని
ఎగురవేయవచ్చు.

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

## ప్రయత్నిస్తూనే వుండు

శీఎన్నో అడ్డంకులను ఎదుర్కోవాల్సి ఉంటుంది
లక్ష్యం చేరుకోవాలంటే...
ఇంకెన్నో అవాంతరాలను ఛేదించాలి కలను నెరవేర్చుకోవాలంటే..
ఎన్నెన్నో ఎత్తుపల్లాలను దాటాల్సి ఉంటుంది
విజయం సాధించాలంటే...
ఎదురౌతారు అడుగడుగునా నిన్ను నిరుత్సాహ పరిచేవారు..
క్షణ క్షణం వెంటాడువారు నిన్ను నిరాశపరిచేవారు..
రోజు రోజూ పక్కనే తిరుగుతుంటారు
నిన్ను ద్వేషిస్తూ వెనుకకు లాగేవారు..
నీ విజయాన్ని నీలో పెరిగే అహంకాం
ం అడ్డుకుంటుంది సూర్యుని కమ్మే మబ్బులా...
నీ అడుగుని ఆపుతుంది నీలో నిండిన భయం అడ్డుగోడలా...
ముందు కలిగిన అపజయం వెనుకడుగు వేయిస్తుంది పిశాచిలా...
అడుగు వేస్తున్నకొద్దీ సందేహాలు పాములా పడగలు విప్పుతాయి..
విజయానికి చేరువవుతున్నకొద్దీ
బిడియం మర్రి ఊడల్లా పాతుకుంటాయి...
ప్రయత్నం చేస్తున్నకొద్దీ బంధువర్గపు
హేళనలు పురుగులా తొలుస్తుంటాయి...
ఎన్ని అవాంతరాలెదురైనా ఆత్మవిశ్వాసమనే ఆయుధం నీదైతే..
ఉత్పాతాలెన్ని ముంచచూసినా నమ్మకమనే ఆధారం తోడైతే..
విజయం నీ ముంగిట పక్షిలా వాలదా పోరాటం నీదైతే...
కనులు తెరిచిన నాటి నుండి చేస్తూనే ఉన్నావు పోరాటం..
ఊహ వచ్చిన నాటి నుండి పడుతూనే వున్నావు ఆరాటం...
ఎవరో ఏదో అన్నారని ఎందుకు నీకు కారణం...
లే లేచి కాలు ఆపకుండా పరుగెత్తు...
పరుగెత్త లేకపోతే నడువు, లేకపోతే పాక్కుంటూ సాగు..
నీ లక్ష్యం చేరే దాకా వెను తిరిగి చూడకు...

-జి. మధు మురళి
భీమారం, హన్మకొండ

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com